విలేకరులు కావలెను
పెన్ సత్తా తెలుగు దినపత్రిక
ఆంధ్రప్రదేశ్ అన్ని జిల్లా లకి పెన్ సత్తా దినపత్రికలో పనిచేయుటకు జిల్లా స్టాఫ్ రిపోర్టర్లు, నియోజకవర్గ ఇంచార్జ్ లు, మండల రిపోర్టర్లు కావలెను. వార్తలు పెట్టె వారికే ప్రాధాన్యత.
ఫోన్ నెం : 9885315759

RNI:APTEL/2023/87729

ప్రశ్నించడం అందరి హక్కు...

# పెన్ సత్తా

PEN SATTA Telugu Daily



సంపుటి : 4 | సంచిక :64 | ఎడిటర్ : చింతమనేని అనిల్ కుమార్ | సోమవారం 27 జూలై 2026 | పేజీలు : 08 | వెల : 03

Published from Vishakapatnam Circulated by Vijayawada, Ongole, Chittoor, Kadapa, Tirupati. Nandyal, Hyderabad, Ananthapur, Kurnool



### విద్యార్థుల డిమాండ్
## న్యాయమైనదే

- 'విద్యార్థులపై జరిగిన క్రూరమైన దాడికి బాధ్యులెవరు'
- అమిత్ షాకు రాహుల్ గాంధీ లేఖ
- జులై 20న నిరసనల్లో విద్యార్థులపై జరిగిన పోలీసు చర్యపై కేంద్ర హోంమంత్రికి రాహుల్ గాంధీ లేఖ
- పెల్లెట్ గన్స్ వినియోగానికి అనుమతి ఇచ్చింది ఎవరో వెల్లడించాలని డిమాండ్

### నేటి నుంచి ఇంటింటికి
# తెలుగుదేశం


- 45 రోజుల పాటు ప్రభుత్వ విజయాలు ప్రజల్లోకి
- పార్టీ ముఖ్య నేతలు, ఎంపీలతో సీఎం చంద్రబాబు టెలికాన్ఫరెన్స్
- రెండేళ్ల పాలనపై ఇంటింటి ప్రచారం, ఇతర అంశాలపై నేతలకు సీఎం దిశానిర్దేశం
- రేపటి నుంచి డోర్ టు డోర్ కార్యక్రమం చేపట్టనున్న టీడీపీ
- వైఎస్సార్సీపీ నాయకులతో వేదిక పంచుకోవద్దు



అమరావతి

గొడ్డలి పార్టీ నేతలతో వేదికలు పంచుకోవద్దని తెలుగుదేశం నేతలకు ఆ పార్టీ అధినేత చంద్రబాబు గట్టి హెచ్చరికలు జారీ చేశారు. గత ప్రభుత్వ విధ్వంసకర విధానాలను ప్రజల్లో ఎండగట్టడమే లక్ష్యంగా సోమవారం నుంచి 45 రోజు ల పాటు "ఇంటింటికీ తెలుగుదేశం" కార్యక్రమానికి శ్రీకారం చుట్టినట్లు తెలిపారు. కేవలం డబ్బుతోనే ఎన్నికల్లో గెలవలేరనే విషయాన్ని 2024 ఫలితాలు నిరూపించాయన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ క్లీన్ స్వీప్ చేయడమే లక్ష్యంగా శ్రేణులంతా కదలాలని చంద్రబాబు పిలుపునిచ్చారు. కార్యక్రమ నిర్వహణపై మంత్రులు, ప్రజాప్రతినిధులు, నేతలు, కార్యకర్తలతో సీఎం చంద్రబాబు టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. కూటమి ప్రభుత్వ రెండేళ్ల పాలన విజయాలు ప్రజల్లోకి తీసుకెళ్లటమే లక్ష్యంగా రేపటి నుంచి చేపడుతున్న "ఇంటింటికీ తెలుగుదేశం" కార్యక్రమంపై టీడీపీ అధినేత చంద్రబాబు శ్రేణులకు దిశా నిర్దేశం చేశారు.

వివరాలు 2లో..




## ఏపీలో 49కి చేరిన కరోనా యాక్టివ్ కేసులు

- అప్రమత్తమైన వైద్య ఆరోగ్యశాఖ
- రాష్ట్రంలో కొత్తగా 10 పాజిటివ్ కేసులు నమోదు
- మొత్తం 49కి చేరిన కరోనా బాధితుల సంఖ్య
- 14 జిల్లాలకు పాకిన వైరస్
- తూర్పుగోదావరిలో అత్యధికం
- ఇప్పటివరకు నలుగురు మృతి

విశాఖపట్నం

రాష్ట్రంలో కరోనా మహమ్మారి మళ్లీ కలకలం రేపుతోంది. రాష్ట్రవ్యాప్తంగా క్రమంగా కోవిడ్ కేసుల సంఖ్య పెరుగుతోంది. తాజాగా రాష్ట్రంలో యాక్టివ్ కేసుల సంఖ్య 49కి చేరింది. ఈ మేరకు రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ అధికారికంగా బులెటిన్ విడుదల చేసింది. కేసుల సంఖ్య పెరుగుతుం డటంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధి కారులు హెచ్చరిస్తున్నారు. రాష్ట్రంలో శనివారం ఒక్కరోజే కొత్తగా 10 పాజిటివ్ కేసులు నమోద య్యాయి. ఇందులో అత్యధికంగా గుంటూరు జిల్లాలో ముగ్గురు కోవిడ్ బారిన పడ్డారు. ఎన్టీఆర్ జిల్లాలో ఇద్దరికి వైరస్ సోకింది. అలాగే అల్లూరి సీతారామరాజు,

వివరాలు 2లో..



### కార్గిల్ వీరుల శౌర్యం
## దేశానికి స్ఫూర్తి

- విజయ్ దివస్ వేళ ప్రధాని మోదీ నివాళి
- కార్గిల్ విజయ్ దివస్ సందర్భంగా అమర జవాన్లకు రాష్ట్రపతి, ప్రధాని మోదీ ఘన నివాళి
- అత్యంత క్లిష్ట పరిస్థితుల్లో సైనికులు చూపిన పరాక్రమం దేశానికి గర్వకారణమని వ్యాఖ్య

## భారత రైల్వేలో కొత్త శకం

- విజయవంతంగా పరుగులు పెట్టిన హైడ్రోజన్ రైలు
- దేశంలో తొలి హైడ్రోజన్ రైలు ట్రయల్ రన్ విజయవంతం
- 1,200 కిలోమీటర్లు ప్రయాణించి 3,200 లీటర్ల డీజిల్ ఆదా
- పొగకు బదులుగా నీటి ఆవిరిని మాత్రమే విడుదల చేసే టెక్నాలజీ
- ఇది పూర్తిగా స్వదేశీ పరిజ్ఞానమని, మేధో హక్కులు భారత్‌వేనని ప్రకటన
- త్వరలోనే ఢిల్లీ మార్గంలోనూ ప్రయోగాత్మక పరుగులు




## ఎక్స్‌ప్రెస్‌లుగా ఆర్డినరీ బస్సులు



- ఇబ్బందులు పడుతున్న ప్రయాణికులు
- పల్లెవెలుగు బస్సులు ఎక్స్‌ప్రెస్‌లుగా
- అవసరం, డిమాండ్ పేరు చెబుతున్నఆర్టీసీ అధికారులు
- ఆర్డినరీ ఎక్స్‌ప్రెస్‌లో ప్రయాణం వల్ల ఆలస్యంగా గమ్యస్థానాలకు

హైదరాబాద్

ఆర్టీసీ అధికారులు పల్లెవెలుగు బస్సులను ఎక్స్‌ప్రెస్‌లుగా మార్చేస్తున్నారు. ఆర్డినరీ బస్సులకు ఎక్స్‌ప్రెస్ బోర్డులు పెడుతున్నారు. అవసరం, డిమాండ్ పేరుతో ప్రయాణికులను ఏమార్చుతున్నారు. దీంతో ప్రయాణికులు చాలా ఇబ్బందులు

- మిగతా3లో



### పాక్ చేసే ఎలాంటి దుస్సాహసానికైనా ఊహించని స్థాయిలో బదులిస్తాం

- కార్గిల్ విజయ్ దివస్ సందర్భంగా ద్రాస్‌లో అమర జవాన్లకు రక్షణ మంత్రి నివాళి
- భారత సార్వభౌమత్వాన్ని సవాలు చేసే ప్రతి చర్యకు కఠిన ప్రతిస్పందన ఉంటుందని హెచ్చరిక
- కార్గిల్ యుద్ధం కేవలం సైనిక, దౌత్య విజయం మాత్రమే కాదు
- భారత జవాన్ల అజేయ సాహసం, అసాధారణ వీరత్వాన్ని ప్రపంచం మొత్తం చూసిన చారిత్రక ఘట్టం

### ఏపీకి మరో భారీ
# పెట్టుబడి

- రూ.1,250 కోట్లతో అయస్కాంతాల తయారీ పరిశ్రమ
- తిరుపతి జిల్లా మేనకూరు పారిశ్రామికవాడలో ఎన్ఏఎన్ గ్రీన్‌మెంట్ సంస్థ ప్రాజెక్టు
- జపాన్ సాంకేతిక పరిజ్ఞానంతో నియోడైమియం ఐరన్ బోరాన్ అయస్కాంతాల తయారీ
- మొదటి దశలో 1200 టన్నుల ఉత్పత్తి



అమరావతి

ఆంధ్రప్రదేశ్‌లో పారిశ్రామికాభివృద్ధి వేగవంతమైంది. రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు జాతీయ, అంతర్జాతీయ సంస్థలు ఆసక్తి చూపుతున్నాయి. ఈ క్రమంలో తిరుపతి జిల్లాకు మరో భారీ ప్రాజెక్టు రానుంది. జిల్లాలోని మేనకూరు పారిశ్రామికవాడలో ఆధునిక సాంకేతికతతో కూడిన అయస్కాంతాల తయారీ పరిశ్రమ ఏర్పాటు కానుంది. ప్రముఖ సంస్థ ఎన్ఏఎన్ గ్రీన్‌మెంట్ ప్రైవేట్ లిమిటెడ్ ఈ భారీ ప్రాజెక్టును నెలకొల్పనుంది. ఇందుకోసం రూ.1,250 కోట్లను పెట్టుబడిగా పెట్టనుంది. ప్రస్తుతం దేశంలో ఎలక్ట్రానిక్, ఎలక్ట్రికల్ పరిశ్రమలు వేగంగా విస్తరిస్తున్నాయి. ఈ పరిశ్రమలకు అవసరమైన నియోడైమియం ఐరన్ బోరాన్ అయస్కాంతాలను ఇప్పటి వరకు పూర్తిగా విదేశాల నుంచే దిగుమతి చేసుకుంటున్నారు. దీనివల్ల విదేశీ మారకద్రవ్యం భారీగా ఖర్చవుతోంది. ఈ సమస్యకు చెక్ పెడుతూ ఎన్ఏఎన్ గ్రీన్‌మెంట్ సంస్థ మేనకూరులో

వివరాలు 2లో..

## 114 రఫేల్ యుద్ధ విమానాల డీల్

- ఫ్రాన్స్ నుంచి క్లారిటీ వచ్చేది అప్పుడే!
- 114 రఫేల్ యుద్ధ విమానాల కొనుగోలు ప్రతిపాదన పంపిన భారత్
- ఆగస్ట్ నెల మధ్య నాటికి అధికారిక సమాధానం ఇవ్వనున్న ఫ్రాన్స్
- 94 రఫేల్ ఫైటర్ జెట్లు భారత్‌లోనే తయారయ్యే అవకాశం



# 13 వేలమంది బాలికలతో 'థింసా' నృత్యం

ఉత్తరాంధ్ర ప్రజల చిరకాల స్వప్నం నెరవేరుతోంది. భోగాపురంలో అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మించిన 'అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయం' ప్రారంభోత్సవానికి సర్వం సిద్ధమైంది. ఆగస్టు 1వ తేదీన ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఈ విమానాశ్రయాన్ని అట్టహాసంగా ప్రారంభించనున్నారు. ఈ చారిత్రక ఘట్టంలో రాష్ట్ర ముఖ్యమంత్రి సైతం పాల్గొననున్నారు. ప్రధాని మోదీ, సీఎంలకు కనీవినీ ఎరుగని రీతిలో ఘన స్వాగతం పలికేందుకు ప్రభుత్వం భారీ ఏర్పాట్లు చేస్తోంది.

గిరిజన సంప్రదాయం ఉట్టిపడేలా : ప్రధాని మోదీకి ఉత్తరాంధ్ర గిరిజన సంప్రదాయ ఆచారాలు ఉట్టిపడేలా స్వాగతం పలకాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇందులో భాగంగా అరకు ప్రాంతానికి చెందిన ప్రసిద్ధ 'థింసా' నృత్యాన్ని భారీ స్థాయిలో ఏర్పాటు చేస్తున్నారు. 13 వేల మంది గిరిజన బాలికలు, మహిళలతో మహా థింసా నృత్యాన్ని ప్రదర్శించనున్నారు. ప్రధాని విమానాశ్రయానికి చేరుకోగానే ఈ భారీ బృందం నృత్యంతో ఘనంగా స్వాగతం పలుకుతుంది.

మూడు జిల్లాల నుంచి కళాకారులు : ఈ థింసా నృత్య ప్రదర్శన కోసం మూడు జిల్లాల నుంచి గిరిజన బాలికలను ఎంపిక చేశారు. అల్లూరి సీతారామరాజు జిల్లా నుంచి 6 వేల మంది, పార్వతీపురం మన్యం జిల్లా నుంచి 5 వేల మంది, పోలవరం జిల్లా నుంచి 2 వేల మంది బాలికలు ఈ నృత్యంలో పాల్గొంటారు. అరకులోయ, పాడేరు, పార్వతీపురం తదితర ప్రాంతాల నుంచి వచ్చే ఈ కళాకారుల కోసం అధికారులు ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలు కూడా ఏర్పాటు చేశారు.

ఐటీడీఏ ఆధ్వర్యంలో పర్యవేక్షణ : ఈ భారీ సాంస్కృతిక కార్యక్రమాన్ని ఐటీడీఏ అధికారులు దగ్గరుండి పర్యవేక్షిస్తున్నారు. ఇంతపెద్ద సంఖ్యలో విచ్చేస్తున్న గిరిజన థింసా కళాకారులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అధికారులు అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నారు. వారికి భోజనం, రవాణా, వసతి తదితర సౌకర్యాల్లో ఎలాంటి లోటు రాకుండా ముందస్తు చర్యలు చేపట్టారు.



ఏర్పాట్లపై మంత్రుల ఉన్నతస్థాయి సమీక్ష : ప్రధాని మోదీ పర్యటన, విమానాశ్రయ ప్రారంభోత్సవ సభ ఏర్పాట్లపై విజయనగరంలో ఉన్నతస్థాయి సమీక్ష జరిగింది. ఈ సమావేశంలో రాష్ట్ర మంత్రులు వంగలపూడి అనిత, బీసీ జనార్దన్ రెడ్డి, కొండపల్లి శ్రీనివాస్, గుమ్మిడి సంధ్యారాణి పాల్గొన్నారు. వారితో పాటు ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, జిల్లా కలెక్టర్ ఎస్.రాంసుందర్ రెడ్డి తదితరులు పాల్గొని ఏర్పాట్లపై సుదీర్ఘంగా చర్చించారు. ఈ భారీ సభను విజయవంతం చేయాలని మంత్రులు అధికారులను ఆదేశించారు.

భారీ జనసమీకరణ : ప్రారంభోత్సవ సభకు ఉమ్మడి విజయనగరం, విశాఖపట్నం, శ్రీకాకుళం జిల్లాల నుంచి భారీగా జనసమీకరణ చేయాలని మంత్రులు నిర్ణయించారు. ముఖ్యంగా విజయనగరం జిల్లాలోని అన్ని నియోజకవర్గాల నుంచి ఎక్కువ మంది ప్రజలను సమీకరించాలని నేతలకు సూచించారు. సభకు వచ్చే వేలాది వాహనాలతో ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా ట్రాఫిక్ మళ్లింపు చర్యలు చేపట్టాలన్నారు. పార్కింగ్‌కు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సమీపంలోని అనువైన ప్రైవేటు స్థలాలను గుర్తించి ఎంపిక చేయాలని పోలీసు, రెవెన్యూ అధికారులను మంత్రులు ఆదేశించారు.

# ఇంద్రకీలాద్రిపై ఆధ్యాత్మిక శోభ

# బెజవాడ దుర్గమ్మకు తెలంగాణ బంగారు బోనం

విజయవాడ ఇంద్రకీలాద్రిపై ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది. ఆషాడ మాసం సందర్భంగా హైదరాబాద్ మహాకాళి జాతర వైభవం విజయవాడకు చేరింది. తెలంగాణ నుంచి తరలివచ్చిన వేలాది మంది భక్తులు భక్తిశ్రద్ధలతో బెజవాడ కనకదుర్గమ్మకు 'బంగారు బోనం' సమర్పించారు. గడచిన 17 ఏళ్లుగా వస్తున్న ఈ ఆనవాయితీని హైదరాబాద్ మహంకాళి జాతర ఉమ్మడి దేవాలయాల ఊరేగింపు కమిటీ ఈ ఏడాది కూడా ఘనంగా నిర్వహించింది. భక్తుల కోలాహలంతో ఆలయ ప్రాంగణం మార్మోగింది.

హైదరాబాద్ నుంచి 2 వేల మంది భక్తులు : బెజవాడ దుర్గమ్మకు తెలంగాణ నుంచి ఏటా ఆషాడ మాసంలో బోనాలు సమర్పించడం ఒక సంప్రదాయంగా వస్తోంది. హైదరాబాద్‌లోని భాగ్యనగర్ మహంకాళి బోనాల ఉత్సవాల ఉమ్మడి దేవాలయాల కమిటీ ఆధ్వర్యంలో ఈ వేడుకను ఘనంగా నిర్వహిస్తారు. ఆషాడమాసం తొలి ఆదివారం రోజున దుర్గమ్మకు ఈ బంగారు బోనం తీసుకురావడం గడచిన 17 ఏళ్లుగా ఆనవాయితీగా వస్తోంది. ఇందులో భాగంగానే తెలంగాణ నుంచి సుమారు రెండు వేల మంది భక్తులు ఆదివారం విజయవాడకు చేరుకున్నారు. అత్యంత భక్తిశ్రద్ధలతో వారు దుర్గమ్మకు బంగారు బోనం తీసుకొచ్చారు.



**జమ్మిదొడ్డి నుంచి ప్రారంభమైన ఊరేగింపు**

ఈ బోనాల ఉత్సవం విజయవాడ పాతబస్తీలోని జమ్మిదొడ్డి చెట్టు వద్ద ప్రారంభమైంది. ముందుగా అక్కడ ఉన్న అమ్మవారికి, ఇతర దేవతా మూర్తులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ పూజల్లో దుర్గగుడి అర్చకులు పాల్గొన్నారు. తెలంగాణ నుంచి బంగారు బోనంతో వచ్చిన జోగిని శ్యామలాదేవితో పాటు పలువురు భక్తులు ఈ కార్యక్రమంలో పాలుపంచుకున్నారు. జమ్మిదొడ్డి వద్ద పూజా కార్యక్రమాలు ముగిసిన అనంతరం బ్రాహ్మణవీధి మీదుగా భారీ ఊరేగింపు ప్రారంభమైంది.

**ఆకట్టుకున్న పోతురాజులు, కోలాటాలు**

బ్రాహ్మణ వీధిలో సాగిన బోనాల ఊరేగింపు నగరవాసులను విశేషంగా ఆకట్టుకుంది. మేళ తాళాలు, డప్పు వాయిద్యాలతో ఆ ప్రాంతం మారుమోగింది. మహిళల కోలాటాలు, వివిధ రకాల నృత్యాలు, కళాకృతులు ఎంతగానో అలరించాయి. ప్రత్యేకించి పోతురాజుల వేషధారణ, బేతాళ నృత్యాలు భక్తులను విశేషంగా ఆకర్షించాయి. డప్పు శబ్దాలకు అనుగుణంగా పోతురాజులు చేసిన నృత్యాలు ఊరేగింపులో ఉత్సాహాన్ని నింపాయి. భక్తులు తీసుకొచ్చిన బంగారు, వెండి బోనాలు, అమ్మవారి విగ్రహాలు స్థానికులను భక్తి పారవశ్యంలో ముంచెత్తాయి.

**ఆలయ మర్యాదలతో స్వాగతం**

ఈ భారీ బోనాల ఊరేగింపు కొండ కింది నుంచి ఇంద్రకీలాద్రిపై ఉన్న ఆలయం వరకు ఘనంగా సాగింది. కొండపైకి చేరుకున్న అనంతరం భక్తులు దుర్గమ్మకు ఆ బంగారు బోనాన్ని భక్తిశ్రద్ధలతో సమర్పించారు. అమ్మవారి దయతో సకాలంలో వర్షాలు బాగా కురవాలని నిర్వాహకులు ఆకాంక్షించారు. పాడి పంటలతో రెండు రాష్ట్రాల ప్రజలు బాగుండాలని ప్రార్థించారు. కాగా, తెలంగాణ నుంచి వచ్చిన భాగ్యనగర్ మహంకాళి బోనాల ఉత్సవాల ఉమ్మడి దేవాలయాల కమిటీ సభ్యులకు దుర్గగుడి అధికారులు స్వాగతం పలికారు. ఆలయ మర్యాదలతో వారికి అమ్మవారి దర్శనం చేయించారు. అనంతరం తీర్థ ప్రసాదాలు అందజేశారు.

"తెలుగు రాష్ట్రాల ప్రజలందరికీ బోనాల పండుగ శుభాకాంక్షలు. హైదరాబాద్ పాతబస్తీలోని బంగారు మైసమ్మ టెంపుల్ నుంచి ఈ బంగారు పాత్రను తీసుకొచ్చాం. అందులో ఇంద్రకీలాద్రి అమ్మవారికి భక్తిశ్రద్ధలతో నైవేద్యం సమర్పించుకుంటున్నాం. ఉమ్మడి దేవాలయాల ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో గత 17 సంవత్సరాలుగా ఈ ఆనవాయితీ కొనసాగుతోంది. దుర్గమ్మకు బోనాలు సమర్పించడం మాకు ఎంతో సంతోషంగా ఉంది."- శ్యామలాదేవి, జోగిని

"రెండు రాష్ట్రాల్లో సకాలంలో వర్షాలు పడాలి. పాడిపంటలు మంచిగా వృద్ధి చెందాలి. ఇరు రాష్ట్రాల ప్రజలు ఎల్లప్పుడూ సంతోషంగా ఉండాలి. ఇదే మా ఆకాంక్ష. ఈ ఆషాడమాసంలో ప్రతి ఏటా వస్తున్న ఆనవాయితీగా ఈ బంగారు పాత్రలో అమ్మవారికి నైవేద్యం పెడుతున్నాం. దుర్గమ్మకు ఇలా బోనం సమర్పించడం మాకు ఆత్మసంతృప్తిని ఇస్తోంది."-మధుసూధన్ యాదవ్, ఛైర్మన్, ఉమ్మడి దేవాలయాల ఉత్సవ కమిటీ

# బంగాళాఖాతంలో వాయుగుండం
# రేపు తీరం దాటే అవకాశం



వాయవ్య బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ఇప్పుడు వాయుగుండంగా బలపడింది. ఇది రానున్న 24 గంటల్లో మరింత తీవ్రరూపం దాల్చి, తీవ్ర వాయుగుండంగా మారే అవకాశం ఉందని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ అధికారికంగా వెల్లడించింది. దీని ప్రభావంతో తీర ప్రాంతాలపై తీవ్ర ప్రభావం పడే ప్రమాదం ఉందని అధికారులు హెచ్చరిస్తున్నారు. రాష్ట్ర యంత్రాంగం అప్రమత్తమై ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టింది.

సముద్రంలో ఏర్పడిన ఈ వాయుగుండం క్రమంగా తీరం వైపు దూసుకువస్తోంది. సోమవారం(రేపు) నాటికి ఇది తీరాన్ని తాకే అవకాశం ఉందని వాతావరణ శాఖ అంచనా వేస్తోంది. ముఖ్యంగా ఒడిశాలోని పారాదీప్, బెంగాల్‌లోని సాగర్ ద్వీపాల మధ్య ఇది తీరం దాటే అవకాశం ఉందని విపత్తుల నిర్వహణ సంస్థ అధికారులు స్పష్టం చేశారు. తీరం దాటే సమయంలో దీని తీవ్రత మరింత ఎక్కువగా ఉండి, భారీ వర్షాలు కురిసే ప్రమాదం ఉందని భావిస్తున్నారు.

వాయుగుండం తీరం దాటుతున్న సమయంలో వాతావరణంలో పెను మార్పులు చోటుచేసుకుంటాయి. దీని ప్రభావం ఆంధ్రప్రదేశ్‌లోని ఉత్తరాంధ్ర జిల్లాలపై కూడా తీవ్రంగా ఉండనుంది. వాయుగుండం ప్రభావంతో ఉత్తరాంధ్ర తీరం వెంబడి గంటకు 55 నుంచి 65 కిలోమీటర్ల వేగంతో బలమైన ఈదురుగాలులు వీచే అవకాశం ఉందని అధికారులు హెచ్చరించారు. గాలుల తీవ్రత ఎక్కువగా ఉండే అవకాశం ఉన్నందున, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని విపత్తుల సంస్థ సూచించింది.

వాయుగుండం కారణంగా సముద్రం అలజడిగా మారనుంది. రాకాసి అలలు ఎగిసిపడే ప్రమాదం ఉంది. ఈ నేపథ్యంలో తీరప్రాంత ప్రజలు జాగ్రత్తగా ఉండాలని విపత్తుల నిర్వహణ సంస్థ అధికారులు హెచ్చరికలు జారీ చేశారు. సముద్ర తీరానికి సమీపంలో నివసించే వారు అప్రమత్తంగా ఉంటూ, అధికారుల సూచనలు పాటించాలని కోరారు. ఈదురుగాలుల సమయంలో చెట్లు, విద్యుత్ స్తంభాలు, పాత భవనాల కింద ఆశ్రయం పొందవద్దని సూచించారు. సముద్రం అల్లకల్లోలంగా మారనున్న నేపథ్యంలో మత్స్యకారులకు అధికారులు ఆదేశాలు జారీ చేశారు. తీర ప్రాంతాల్లో గాలి, అలల ఉద్ధృతి ఎక్కువగా ఉండే అవకాశం ఉన్నందున, ఎట్టి పరిస్థితుల్లోనూ మత్స్యకారులు సముద్రంలోకి చేపల వేటకు వెళ్లరాదని విపత్తుల నిర్వహణ సంస్థ స్పష్టం చేసింది. వాతావరణం సాధారణ స్థితికి చేరుకునే వరకు వేటను పూర్తిగా నిలిపివేయాలని హెచ్చరించింది. అవాంఛనీయ ఘటనలు జరగకుండా రెవెన్యూ, పోలీస్, విపత్తు నిర్వహణ శాఖలు సమన్వయంతో పనిచేస్తున్నాయి. మరోవైపు, వర్షాలు కురవక కమ్ముకున్న ఆందోళనల మధ్య అన్నదాతలు దేవుడిని వేడుకుంటున్నారు. కర్నూలు జిల్లా ఆదోనిలో కరవు ఛాయలు తొలగిపోయి, వర్షాలు సమృద్ధిగా కురవాలని ఆకాంక్షిస్తూ ప్రత్యేక పూజలు చేపట్టారు. ఆదోని వ్యవసాయ మార్కెట్ యార్డులో స్థానిక వ్యాపారులు, కమిషన్ ఏజెంట్లు, పారిశ్రామిక సంఘాల ఆధ్వర్యంలో శ్రీ వరుణ యాగాన్ని అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ప్రస్తుతం నాటిన పంటలు వర్షాభావంతో ఎండిపోకుండా ఉండాలని, రైతాంగం సంతోషంగా జీవించాలని కోరుకుంటూ వేద పండితుల మంత్రోచ్చారణల నడుమ ఈ యాగం కొనసాగింది. ప్రాంత శ్రేయస్సు, సమృద్ధిగా వర్షాలు కురవాలని ఆకాంక్షిస్తూ నిర్వహించిన ఈ ఆధ్యాత్మిక కార్యక్రమంలో కమిషన్ ఏజెంట్లు, ప్రముఖ వ్యాపారులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు.

## నేటి నుంచి ఇంటింటికి తెలుగుదేశం

-మొదటిపేజీ తరువాయి

వైఎస్సార్సీపీని 'గొడ్డలి పార్టీ'గా అభివర్ణించారు. ఆ పార్టీ నేతలు ట్రాప్‌లో ఎవరూ పడొద్దన్నారు. వారితో ఎట్టి పరిస్థితుల్లోనూ వేదికలను పంచుకోవద్దని హితవు పలికారు. కులసంఘాల సమావేశాలు, సంతాప సభల పేరిట జరిగే కార్యక్రమాల్లో ఇటీవల కొందరు నేతలు వైఎస్సార్సీపీ నాయకులతో కలిసి వేదిక పంచుకోవటాన్ని తప్పుబడుతూ అసహనం వ్యక్తం చేశారు. గొడ్డలి పార్టీ ఒక విష వృక్షమని, నిత్యం కులాలు, మతాల అడ్డం పెట్టుకుని సమాజంలో విద్వేషాలు రగిలించడమే ఆ పార్టీ నైజమని మండిపడ్డారు. ఘోర ఓటమి చవిచూసినా ఆ పార్టీ విధానాల్లో మార్పు రాలేదన్నారు. ఇప్పటికీ సమాజంలో చిచ్చు పెట్టేందుకే ప్రయత్నిస్తోందని చంద్రబాబు అన్నారు.

**స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయకేతనం ఎగరాలి**

రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి విజయకేతనం ఎగరేయడమే ఏకైక లక్ష్యంగా ప్రతి ఒక్కరూ కష్టపడి కాకుండా ఇష్టపడి పనిచేయాలని చంద్రబాబు పిలుపునిచ్చారు. ఈ ఎన్నికల్లో అన్ని స్థానాలను కైవసం చేసుకునేలా బూత్ కన్వీనర్ల నుంచి అగ్రస్థాయి నేతల వరకు ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని ఆదేశించారు. తనకు కేవలం తన వెనక నడిచే అనుచరులు అవసరం లేదన్నారు. సమస్యలకు పరిష్కారం చూపగలిగే సమర్థవంతమైన నాయకులు పార్టీకి కావాలని చంద్రబాబు స్పష్టం చేశారు.

నేతల్లో లీడర్ షిప్ క్వాలిటీస్ పెరగాలని, కేవలం డబ్బులు ఉన్నాయనే ధీమాతో ప్రజాభిమానాన్ని పొందలేమనే నిజాన్ని గ్రహించాలన్నారు. ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉండాలని హితవు పలికారు. కూటమి ప్రభుత్వం మళ్లీ అధికారంలోకి రావడం ఖాయమన్న ధీమా ఉన్నప్పటికీ ఎక్కడా ఏమరుపాటు పనికిరాదన్నారు. ప్రజలకు నచ్చని పనులను అసలు చేయవద్దని హెచ్చరించారు. రాష్ట్ర సమగ్ర అభివృద్ధి కోసం కూటమి ప్రభుత్వం కచ్చితంగా కొనసాగాల్సిన అవసరం ఎంతైనా ఉందనే విషయాన్ని ప్రతి ఒక్క ఓటరుకు అర్థమయ్యేలా వివరించాలని హితబోధ చేశారు.

**45 రోజుల పాటు 'డోర్ టు డోర్' కార్యక్రమం**

కూటమి ప్రభుత్వం రెండేళ్ల పాలనను విజయవంతంగా పూర్తి చేసుకుంటున్న సందర్భంగా ప్రజల్లోకి వెళ్లేందుకు ఇంటింటికీ తెలుగుదేశం కార్యాచరణను అధినేత చంద్రబాబు ప్రకటించారు. రేపటి నుంచి 45 రోజుల పాటు రాష్ట్రవ్యాప్తంగా ప్రతి ఇంటికి వెళ్లేలా 'డోర్ టు డోర్' అవుట్ రీచ్ కార్యక్రమాన్ని చేపట్టాలని దిశా నిర్దేశం చేశారు. ఎన్నికల సమయంలో ఓట్లు అడగడానికి ఏ విధంగా ప్రతి ఇంటికి వెళ్లామో, ఇప్పుడు అదే ఉత్సాహంతో వెళ్లాలన్నారు. హామీలను ఎలా అమలు చేస్తున్నామో ప్రజలకు వివరించాలని స్పష్టం చేశారు. క్షేత్రస్థాయిలో ప్రజలకు ప్రభుత్వంపై ఏవైనా అనుమానాలు ఉంటే వాటిని ఓపికగా నివృత్తి చేయాలన్నారు. పాలనలోని పారదర్శకతను వారికి అర్థమయ్యేలా చెప్పాలని సూచించారు. గొడ్డలి పార్టీ యువత భవితను ఏ విధంగా నిర్వీర్యం చేసిందో వివరించాలన్నారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం యువత సంక్షేమానికి, వారి ఆలోచనలకు ఇస్తున్న ప్రాధాన్యతను విస్తృతంగా ప్రచారం చేయాలన్నారు. నిరంతరం ప్రజల్లో ఉంటూ వారితో కనెక్ట్ కావడం ద్వారా మాత్రమే విపక్షాల కుట్రలను, తప్పుడు ప్రచారాలను సమర్థవంతంగా తిప్పికొట్టగలమని చంద్రబాబు స్పష్టం చేశారు. గడిచిన ఎన్నికల్లో ఆంధ్రప్రదేశ్ ప్రజలు కూటమికి చారిత్రాత్మకమైన విజయాన్ని అందించారని చంద్రబాబు గుర్తు చేశారు. ఏకంగా 94 శాతం స్ట్రైక్ రేట్‌తో పాటు 57 శాతం ఓట్లు సాధించడం కూటమి విజయ తీరాలకు నిదర్శనమని చంద్రబాబు వెల్లడించారు. గత వైఎస్సార్సీపీ ప్రభుత్వం చేసిన ఘోర తప్పిదాలు, విచ్చలవిడి విధ్వంసం వల్లే ఆ పార్టీ 151 స్థానాల నుంచి కేవలం 11 సీట్లకు పడిపోయిందని విమర్శించారు.

## ఏపీకి మరో భారీ పెట్టుబడి

-మొదటిపేజీ తరువాయి

ఈ అయస్కాంతాల తయారీకి శ్రీకారం చుట్టింది. అత్యుత్తమ జపాన్ సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి ఈ పరిశ్రమను ఏర్పాటు చేయనున్నారు. ఈ తయారీకి అవసరమైన కీలకమైన ఖనిజ సంపద మన రాష్ట్రంలోనే పుష్కలంగా అందుబాటులో ఉండటం మరో సానుకూల అంశం.

**కూటమి ప్రభుత్వ కృషితో ఏపీకి క్యూ**

రాష్ట్రంలో కొత్తగా కొలువుదీరిన కూటమి ప్రభుత్వం పారిశ్రామిక రంగానికి పెద్దపీట వేస్తోంది. ప్రభుత్వ పారిశ్రామిక అనుకూల విధానాల ఫలితంగా రాష్ట్రంలో ఎలక్ట్రానిక్, సెమీకండక్టర్, పీసీబీ తయారీ పరిశ్రమలు భారీగా ఏర్పాటు అవుతున్నాయి. ఈ పారిశ్రామిక అనుకూల వాతావరణంలో భాగంగానే ఎన్ఏఎన్ గ్రీన్‌మెంట్ సంస్థ ఈ భారీ పెట్టుబడికి ముందుకొచ్చింది. నిజానికి ఈ సంస్థ ఇప్పటికే మేనకూరు పారిశ్రామికవాడ కేంద్రంగా లిథియం అయాన్ బ్యాటరీల తయారీ పరిశ్రమను ఏర్పాటు చేస్తోంది. ఇప్పుడు ఆ ప్రాజెక్టుకు అనుబంధంగానే ఈ నూతన అయస్కాంతాల తయారీ కేంద్రాన్ని కూడా నెలకొల్పాలని నిర్ణయించింది.

**25 ఎకరాల కేటాయింపు**

ఈ భారీ ప్రాజెక్టు ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తోంది. ఆంధ్రప్రదేశ్ పారిశ్రామిక మౌలిక సదుపాయాల సంస్థ (ఏపీఐఐసీ) ద్వారా మేనకూరు పారిశ్రామిక వాడలో 25 ఎకరాల స్థలాన్ని ప్రభుత్వం ఇప్పటికే కేటాయించింది. ఈ ప్రాజెక్టును దశలవారీగా విస్తరించనున్నారు. మొదటి దశలో ఏడాదికి 1,200 టన్నుల అయస్కాంతాలను ఉత్పత్తి చేసే సామర్థ్యంతో ఈ పరిశ్రమను ప్రారంభిస్తారు. భవిష్యత్తులో ఈ ఉత్పాదక సామర్థ్యాన్ని 10 వేల టన్నులకు పెంచే దిశగా యాజమాన్యం ప్రణాళికలు సిద్ధం చేసింది.

**స్థానికులకు ఉపాధి అవకాశాలు**

ఈ ప్రాజెక్టు ద్వారా స్థానికంగా ఉపాధి అవకాశాలు భారీగా మెరుగుపడనున్నాయి. ఈ పరిశ్రమ ద్వారా ప్రత్యక్షంగా 500 మందికి ఉద్యోగాలు లభించనున్నాయి. పరోక్షంగా మరికొంత మందికి ఉపాధి దొరకనుంది. పరిశ్రమల ఏర్పాటుతో అనుబంధ రంగాలు సైతం అభివృద్ధి చెందుతాయి. మొత్తానికి తిరుపతి జిల్లా పారిశ్రామికంగా మరింత అభివృద్ధి చెందడానికి ఈ ప్రాజెక్టు కీలకంగా మారనుంది.

## ఏపీలో 49కి చేరిన
## కరోనా యాక్టివ్ కేసులు

-మొదటిపేజీ తరువాయి



విశాఖపట్నం, ఏలూరు, కృష్ణా, తిరుపతి జిల్లాల్లో ఒక్కొక్కటి చొప్పున కొత్త కేసులు వెలుగుచూశాయి. దీంతో ఆయా జిల్లాల యంత్రాంగం వెంటనే అప్రమత్తమైంది. కరోనా అనుమానిత లక్షణాలు ఉన్నవారికి వైద్యశాఖ వెంటనే పరీక్షలు నిర్వహిస్తోంది. రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటివరకు 302 మంది అనుమానితులకు కోవిడ్ నిర్ధారణ పరీక్షలు చేశారు. ఇప్పటివరకు వైరస్ బారిన పడి నలుగురు ప్రాణాలు కోల్పోయారు. ప్రస్తుతం 16 మంది బాధితులు వివిధ ఆసుపత్రుల్లో ఉండి చికిత్స పొందుతున్నారు. మరో 24 మంది బాధితులు హోం ఐసోలేషన్‌లో ఉండి వైద్యుల పర్యవేక్షణలో మందులు వాడుతున్నారు. తూర్పుగోదావరి జిల్లాలో అత్యధికం : రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 14 జిల్లాల్లో కోవిడ్ కేసులు ఉన్నట్లు వైద్య ఆరోగ్యశాఖ గుర్తించింది. వీటిలో అత్యధికంగా తూర్పుగోదావరి జిల్లాలో 11 కేసులు నమోదయ్యాయి. ఆ తర్వాతి స్థానాల్లో గుంటూరులో 9, వైఎస్సార్ కడపలో 8, విశాఖపట్నంలో 5, ఎన్టీఆర్ జిల్లాలో 3 కేసులు వెలుగుచూశాయి. ఇక కాకినాడ, ఏలూరు, బాపట్ల, పార్వతీపురం మన్యం జిల్లాల్లో రెండేసి కేసులున్నాయి. అల్లూరి సీతారామరాజు, అనకాపల్లి, కృష్ణా, తిరుపతి, శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాల్లో ఒక్కొక్కటి చొప్పున కేసులు నమోదయ్యాయి.

**సర్వం సిద్ధం చేసిన వైద్యశాఖ**

కరోనా కేసుల సంఖ్య పెరుగుతున్న నేపథ్యంలో రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ పూర్తి స్థాయిలో అప్రమత్తమైంది. కేసుల గుర్తింపు, పరీక్షల నిర్వహణ వేగవంతం చేసింది. పాజిటివ్ కేసుల పర్యవేక్షణ, ఆసుపత్రుల్లో చికిత్సపై రాష్ట్రవ్యాప్తంగా యంత్రాంగాన్ని అలర్ట్ చేసింది. సెకండరీ హెల్త్, డీఎంఈ పరిధిలోని అన్ని ప్రభుత్వాసుపత్రుల్లోనూ ముందస్తు ఏర్పాట్లు చేశారు. కోవిడ్ బాధితుల కోసం ప్రత్యేక పడకలు, అవసరమైన కిట్లు సిద్ధం చేశారు. అన్ని ఆసుపత్రుల్లో మందులు, వైద్య పరికరాలను పూర్తిస్థాయిలో అందుబాటులో ఉంచినట్లు వైద్యాధికారులు వెల్లడించారు.

# బ్రాహ్మణుల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉంది ఎమ్మెల్యే యార్లగడ్డ.





- గాయత్రి అమ్మవారి ఆషాఢ సారే మహోత్సవంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన ఎమ్మెల్యే.
- బ్రాహ్మణ కళ్యాణ మండపం నిర్మాణానికి అనువైన స్థలం గుర్తించాలని ఎంఆర్ఓకు ఆదేశం.
- త్వరలో కళ్యాణ మండపం నిర్మాణ ప్రక్రియ ప్రారంభిస్తానని హామీ.


**గన్నవరం, పెన్ సత్తా, జూన్ 26:** నియోజకవర్గం లోని బ్రాహ్మణుల సంక్షేమం, ఆర్థికాభివృద్ధికి ప్రభుత్వం పూర్తిస్థాయిలో కట్టుబడి ఉందని ఏపీ ప్రభుత్వ విప్, గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు అన్నారు. గన్నవరం సొసైటీపేటలో గాయత్రి అమ్మవారి దేవస్థానం కమిటీ, గన్నవరం బ్రాహ్మణ పరిషత్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన ఆషాఢ మాస కార్యక్రమం, బ్రాహ్మణుల ఆత్మీయ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నియోజకవర్గం లోని బ్రాహ్మణుల ఆర్థికాభివృద్ధి కోసం రూ.20.50 లక్షల రుణాలు పంపిణీ చేసినట్లు తెలిపారు. బీమా పథకం ప్రతి కుటుంబానికి ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. రూ.600 సభ్యత్వంతో సహజ మరణానికి రూ.50 వేల ఆర్థిక సాయం, ప్రమాద బీమా ప్రయోజనాలు లభిస్తాయని వివరించారు. సభ్యత్వ రుసుము చెల్లించలేని నిరుపేదలకు తానే స్వయంగా ఆ మొత్తం చెల్లిస్తానని హామీ ఇచ్చారు. బ్రాహ్మణ సమాజం కోరిన కళ్యాణ మండపం నిర్మాణానికి సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా అనువైన స్థలాన్ని పరిశీలించాలని ఎంఆర్ఓను ఆదేశించినట్లు తెలిపారు. త్వరలోనే ఈ అంశం పై చర్యలు ప్రారంభిస్తామని చెప్పారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు బ్రాహ్మణ కార్పొరేషన్ ద్వారా సమాజానికి అండగా నిలుస్తున్నారని, భవిష్యత్తులో మరిన్ని రుణాలు నియోజకవర్గానికి వచ్చేలా కృషి చేస్తానన్నారు. బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ సహకారంతో మరింత లబ్ధి చేకూరేలా ప్రయత్నిస్తానని తెలిపారు. అంతకుముందు ఎమ్మెల్యే గాయత్రి అమ్మవారికి నిర్వహించిన ఆషాఢ సారే మహోత్సవంలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో రాష్ట్ర బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ పి.వి ఫణికుమార్, రాష్ట్ర టీడీపీ కార్యదర్శి, విజయవాడ సెంట్రల్ నియోజకవర్గ పరిశీలకులు బచ్చుల సుబ్రహ్మణ్యం (బోస్), గన్నవరం గ్రామ టిడిపి అధ్యక్షులు జాస్తి శ్రీధర్, గన్నవరం బ్రాహ్మణ పరిషత్, గాయత్రి మందిర పరిషత్ చైర్మన్ కె.వి.ఆర్ కిషోర్, ఆలయ కమిటీ కార్యదర్శి ఎస్.వి.జి కృష్ణ, కమిటీ ట్రెజరర్ ఎస్. రవికుమార్, కూటమి నాయకులు జాస్తి మురళి, మోదుగుమూడి సత్యనారాయణ, మద్దినేని వెంకటేశ్వర రావు, చిమటా రవివర్మ, బుస్సే నాగప్రసాద్, చల్లగుల్ల సందీప్, కొసరాజు సాయిరాం, బుస్సే సరిత, ఆళ్ల దమయంతి, దేవినేని సులోచన, జాస్తి తాతారావు, నసరత్ బేగం, కంచర్ల సూర్యప్రకాష్, కంభంపాటి దత్త సాయిరాం, అమ్మవారి భక్తులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.





# మై భారత్ పోర్టల్‌లో యువత నమోదు కావాలి ప్రధాని నరేంద్ర మోదీ పిలుపు.

## వికసిత్ భారత్ -- వైబ్రేట్ విలేజ్ కార్యక్రమంలో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా యువతతో ప్రధాని సంభాషణ.






**అనకాపల్లి, జూలై 26:** భారత ప్రభుత్వం కేంద్ర యువజన వ్యవహారాల, క్రీడల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన "వికసిత్ భారత్ -- వైబ్రేట్ విలేజ్" కార్యక్రమంలో భాగంగా భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ దేశవ్యాప్తంగా యువతను ఉద్దేశించి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రసంగించారు. ఈ కార్యక్రమాన్ని అనకాపల్లి కలెక్టర్ కార్యాలయం నుంచి జిల్లా యువత వీక్షించి ప్రధానమంత్రి ప్రసంగాన్ని ఆలకించారు. దేశం లోని వివిధ రాష్ట్రాల నుంచి వేలాది మంది యువత ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

జూన్ 3 నుంచి 11 వ తేదీ వరకు నిర్వహించిన వైబ్రేట్ విలేజ్ కార్యక్రమంలో పాల్గొన్న యువతీ యువకులు తమ అనుభవాలను ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తో పంచుకున్నారు. ఈ సందర్భంగా యువతలో దేశభక్తి, సేవాభావం, నాయకత్వ లక్షణాలు మరింత పెంపొందించే కార్యక్రమాలను ప్రభుత్వం చేపడుతోందని ప్రధాని పేర్కొన్నారు. మై భారత్ పోర్టల్ ద్వారా యువతకు అనేక అవకాశాలు అందుబాటులో ఉన్నాయని, ప్రతి యువకుడు, యువతి తప్పనిసరిగా మై భారత్ పోర్టల్‌లో నమోదు చేసుకోవాలని ప్రధానమంత్రి పిలుపు నిచ్చారు. ఈ వేదిక ద్వారా యువత తమ ప్రతిభను జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిల్లో ప్రదర్శించుకునే అవకాశం లభిస్తుందని, దేశాభివృద్ధిలో భాగస్వాములు కావాలని ఆయన సూచించారు. యువత తమ నైపుణ్యాలను మెరుగుపరుచుకుంటూ, సామాజిక సేవా కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొని వికసిత్ భారత్ -- 2047 లక్ష్య సాధనకు తోడ్పడాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పిలుపు నిచ్చారు.

## ఆషాఢంలో మొదలైన అమ్మవారి బోనాల జాతర



**నక్కపల్లి, పెన్ సత్తా జూలై 26 :** ఆషాఢమాసంలో అమ్మవారి బోనాల సంబరాలు ప్రారంభమయ్యాయి. ఆషాడ మాసంలో గ్రామ దేవతలైన నూకాలమ్మ, మరిడిమాంబ, పోలేరమ్మ, సత్తమ్మ తల్లి అమ్మవారి ఆలయాల వద్ద భక్తులు బోనాలు సమర్పించుకుంటారు. దీనిలో భాగంగా నక్కపల్లి మండలం ఉపమాక శివారు సారిపల్లివానిపాలెం గ్రామంలో ఆషాఢం రెండో ఆదివారం సందర్భంగా గ్రామ దేవత నూకాలమ్మకు బోనాల సంబరాన్ని గ్రామస్తులు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. అనేక మంది మహిళలు నైవేద్యాలతో నింపిన బోనాలను అలంకరించి, వాటిని శిరస్సుపై ధరించి గ్రామ పురవీధుల్లో డప్పు వాయిద్యాల నడుమ ఊరేగించారు. అనంతరం నూకాలమ్మ ఆలయం వద్ద బోనాలను సమర్పించి, అమ్మవారికి ప్రత్యేక హారతులిచ్చారు. మధ్యాహ్నం అన్న ప్రసాదాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, ఉత్సవనిర్వాహకులు పాల్గొన్నారు.

## వేంపాడు టోల్ ప్లాజా వద్ద కారులో వ్యక్తులపై దోపిడీ

కారు అద్దాలు పగలగొట్టి బంగారం అపహరించికపోయిన అగంతకులు






**నక్కపల్లి, పెన్ సత్తా, జులై 26:** నక్కపల్లి మండలం వేంపాడు టోల్ ప్లాజా సమీపంలో కారులో నిద్రిస్తున్న వ్యక్తులపై గుర్తు తెలియని వ్యక్తులు దాడి చేసి బంగారం అపహరించుకుపోయారు.

నక్కపల్లి సిఐ జె.మురళి అందించిన వివరాలు ఇలా ఉన్నాయి. టోల్ ప్లాజా వద్ద హోటల్ జాష్‌కు 200 మీటర్ల ముందు జాతీయ రహదారి-16పై ఆదివారం తెల్లవారుజామున సుమారు 3:30 గంటలకు దోపిడీ జరిగిందన్నారు.

మార్కాపురం జిల్లా, కనిగిరికి చెందిన పి. రమేష్ బాబు అతని కుటుంబ సభ్యులైన అతని భార్య కళ్యాణి,ఇద్దరు పిల్లలు తమ్ముడు కలిసి కారులో విజయవాడ నుంచి విశాఖపట్నం వెళ్తుండగా, డ్రైవర్‌కు నిద్ర రావడంతో కారును రోడ్డు పక్కన ఆపి విశ్రాంతి తీసుకుంటున్నారు. ఈ సమయంలో గుర్తు తెలియని వ్యక్తి కారు సైడ్ అద్దాన్ని రాయితో పగులగొట్టి, కళ్యాణి మెడలో ఉన్న సుమారు మూడు తులాల బంగారు మంగళసూత్రాన్ని, నల్ల పూసలను లాక్కొని పరారయ్యాడు.సమాచారం అందుకున్న వెంటనే నర్సీపట్నం డిఎస్పి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని క్లూస్ టీమ్, డాగ్ స్క్వాడ్ సహాయంతో ఆధారాలను సేకరించారు. కేసు నమోదు చేసి, నిందితుడిని గుర్తించి అరెస్టు చేసేందుకు ప్రత్యేక బృందాలు దర్యాప్తు చేపట్టాయని సిఐ మురళి తెలిపారు.

## 100 డేస్ గంజాయి వ్యతిరేక అవగాహన కార్యక్రమం.




**పరవాడ, పెన్ సత్తా, జులై 26:** మండలం లోని భరణికం గ్రామంలో 100 డేస్ గంజాయి వ్యతిరేక అవగాహన కార్యక్రమంలో భాగంగా పరవాడ పోలీస్ స్టేషన్ ఎస్ఐ సీహెచ్ భీమరాజు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ భీమరాజు మాట్లాడుతూ గంజాయి, ఇతర మత్తు పదార్థాల వినియోగం యువత భవిష్యత్తును నాశనం చేస్తుందని, మత్తు పదార్థాలకు పూర్తిగా దూరంగా ఉండాలని సూచించారు. మత్తు పదార్థాల విక్రయాలు, రవాణా లేదా వినియోగానికి సంబంధించిన సమాచారం తెలిసిన వెంటనే పోలీసులకు తెలియజేసి సమాజాన్ని మత్తు రహితంగా తీర్చిదిద్దడంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బర్నికం గ్రామ నాయకులు పెదిశెట్టి శేఖర్, గ్రామ పెద్దలు, గ్రామ యువత పాల్గొని గంజాయి నిర్మూలనకు తమ వంతు సహకారం అందిస్తామని ప్రతిజ్ఞ చేశారు.

పరవాడ పోలీస్ స్టేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమం ద్వారా యువతలో మత్తు పదార్థాల దుష్పరిణామాల పై అవగాహన కల్పించి, మత్తు రహిత సమాజ నిర్మాణానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు.

## ఘనంగా ప్రగడ కోటయ్య 111వ జయంతి వేడుకలు.

- సమాజ సేవ, చేనేత కార్మికుల సంక్షేమానికి ప్రగడ కోటయ్య చేసిన సేవలు చిరస్మరణీయం.
- జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్.



**అనకాపల్లి, పెన్ సత్తా, జూలై 26:** రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహిస్తున్న స్వాతంత్ర్య సమరయోధుడు, మాజీ పార్లమెంట్ సభ్యుడు, చేనేత ఉద్యమ నాయకుడు ప్రగడ కోటయ్య 111 వ జయంతి సందర్భంగా క్యాంప్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్ ప్రగడ కోటయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్ మాట్లాడుతూ ప్రగడ కోటయ్య స్వాతంత్ర్య సమరయోధుడిగా, ప్రజా ప్రతినిధిగా, ముఖ్యంగా చేనేత కార్మికుల హక్కుల పరిరక్షణకు, వారి సంక్షేమానికి విశేష కృషి చేసిన మహనీయుడని కొనియాడారు. ప్రగడ కోటయ్య చేనేత ఉద్యమ నాయకులు. 1945 లో మహాత్మా గాంధీ ఆశీస్సులతో నాగపూర్లో స్థాపించబడిన ఆల్ ఇండియా హ్యాండ్లూమ్ వీవర్స్ కాంగ్రెస్ కి ప్రధాన కార్యదర్శిగా, ఆంధ్రప్రదేశ్ లో చేనేత కార్మికుల ఉద్యమానికి అగ్రగణ్య నాయకుడిగా పేరు గావించారని తెలిపారు.

## ఘనంగా ప్రగడ కోటయ్య 111 వ జయంతి కార్యక్రమం.





**అనకాపల్లి, పెన్ సత్తా, జులై 26:** పట్టణం పద్మశాలి సంక్షేమ సేవా సంఘం సభ్యులు ఆధ్వర్యంలో ప్రగడ కోటయ్య 111 వ జయంతి వేడుకలు కార్యక్రమం. అనకాపల్లిలో పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు తిప్పాన అప్పారావు, సంఘం గౌరవ అధ్యక్షులు పంపాన వీర అప్పారావు, అంజూరి రామకృష్ణ, సంఘ అధ్యక్షులు డాక్టర్ దివ్య తేజ ప్రభాకర్, శీరం వెంకట లక్ష్మీ, బొజ్జా రామారావు, రాపర్తి ప్రభాకర్ రావు, తదితరులు పాల్గొన్నారు. చేనేత పితామహుడు ప్రజాబంధు చేనేత సూర్యుడు చేనేత పరిశ్రమ అభ్యున్నతికి చేనేత కార్మికుల సంక్షేమానికి తన జీవితాంతం అంకితభావంతో సేవలు అందించిన మహనీయుడు ప్రగడ కోటయ్య జయంతి సందర్భంగా చేనేత జాతి కోసం ఎన్నో ఉద్యమాలు, పోరాటాలు చేసినందుకు ఆయన్ని గుర్తించి, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఆయన యొక్క జయంతిని అధికారంగా నిర్వహించడానికి ప్రభుత్వం ప్రకటించినందుకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేస్తున్నామని తెలిపారు.

## గుంటూరులో వైయస్ఆర్‌సీపీ విద్యార్థి, యువత ర్యాలీ పోస్టర్ ఆవిష్కరణ



**గుంటూరు: పెన్ సత్తా, జులై 26:** వైయస్ఆర్‌సీపీ ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి కార్యాలయంలో పార్టీ విద్యార్థి, యువజన విభాగాల నాయకుల ఆధ్వర్యంలో ఈ నెల 28న తలపెట్టిన విద్యార్థి, యువత ర్యాలీ పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి హాజరై పోస్టర్‌ను ఆవిష్కరించారు.

ఈ సందర్భంగా పార్టీ విద్యార్థి, యువజన విభాగాల నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. వైయస్ఆర్‌సీపీ రాష్ట్ర విద్యార్థి విభాగం అధ్యక్షుడు పానుగంటి చైతన్య, గుంటూరు జిల్లా అధ్యక్షుడు వినోద్, గుంటూరు నగర అధ్యక్షుడు రవి, రాష్ట్ర విద్యార్థి విభాగం ప్రధాన కార్యదర్శి గంటి, ఎస్సీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బాజీ, గుంటూరు జిల్లా విద్యార్థి విభాగం ఉపాధ్యక్షుడు జగదీష్, గుంటూరు సిటీ యువజన విభాగం అధ్యక్షుడు కోటి, యువజన విభాగం నాయకుడు అనిల్‌తో పాటు గుంటూరు జిల్లా విద్యార్థి విభాగం నాయకులు మస్తాన్, సాజిద్, అరుణ్ తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

# గ్యాస్ లీక్ అయ్యి వ్యాపించిన మంటలు



- తప్పిన పెను ప్రమాదం
- మంటలు ఆర్పిన పోలీసులు

**నక్కపల్లి, పెన్ సత్తా, జులై 26:** మండలంలో కాగిత గ్రామంలో ఒక ఇంట్లో గ్యాస్ లీక్ అయ్యి భారీ మంటలు వ్యాపించాయి. గ్రామానికి చెందిన పోతంశెట్టి గణేష్ ఇంటి వద్ద ఆదివారం వంటలు చేస్తుండగా గ్యాస్ పైప్ నుండి లీక్ అయ్యి ఒక్కసారిగా మంటలు వ్యాపించాయి. దీంతో వంటలు చేస్తున్న మహిళలు భయంతో బయటకు పరుగులు తీశారు. ఈ సంఘటన తెలుసుకున్న స్థానికులు మంటలు అదుపు చేసేందుకు తీవ్ర ప్రయత్నాలు చేసిన ఫలితం లేకపోయింది. వంటగది మొత్తం మంటలు చెలరేగాయి. ఇసుక గోనె సంచల తో స్థానికులు మంటలు ఆర్పే ప్రయత్నం చేసినప్పటికీ పొగలు వ్యాపించడంతో గ్రామానికి



సమీపంలో ఉన్న నక్కపల్లి హైవే పోలీసులను ఆశ్రయించారు. దీంతో పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను ఆర్పి వేశారు. ఈ ఘటనలో వంట



గదిలో ఉన్న సామగ్రి, కాలిపోయాయి. ఈ ప్రమాదంలో ఎటువంటి ప్రాణ నష్టం జరగకపోవడంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు.

## డీఎస్సీ కుంభకోణానికి బాధ్యత వహిస్తూ నారా లోకేష్ తక్షణమే రాజీనామా చేయాలి

**విశాఖపట్నం:** ఆంధ్రప్రదేశ్‌లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజాస్వామ్యాన్ని ఘోరంగా దెబ్బతిన్నదని.. వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి కొండా రాజీవ్ ధ్వజమెత్తారు. దేశ స్థాయిలో నీట్ ఎంత పెద్ద సమస్యగా మారిందో, రాష్ట్రంలో డిఎస్సీ కూడా అంతే పెద్ద కుంభకోణంగా మారిందని మండిపడ్డారు. డియస్సీలో అక్రమాలకు పాల్పడ్డం ద్వారా లక్షలాది మంది నిరుద్యోగ యువత జీవితాలతో ఆడుకున్నారని ఆక్షేపించారు. ఈ కుంభకోణానికి సంబంధించి మాజీ ముఖ్యమంత్రి వైఎస్. జగన్సాక్ష్యాధారాలతో సహా బహిరంగంగా ఎత్తిచూపినప్పటికీ ప్రభుత్వం నుంచి ఎలాంటి జవాబుదారీతనం లేకపోవడం దారుణమన్నారు. విద్యాశాఖ మంత్రిగా పూర్తిగా వైఫల్యం చెందిన నారా లోకేష్ తక్షణమే తన పదవికి రాజీనామా చేయాలని, ఈ స్కామ్‌పై సీబీఐ విచారణ జరిపించాలని కొండా రాజీవ్ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఇంకా ఏమన్నారంటే..

**- డిఎస్సీ భారీ కుంభకోణం..**

దేశవ్యాప్తంగా విద్యార్థులు, యువత తమ డిమాండ్ల కోసం పోరాడి సాధించుకుంటూ ప్రజాస్వామ్య కీర్తిని పెంచుతుంటే, ఏపీలో మాత్రం ప్రజాస్వామ్యం ఘోరంగా కూనీ అవుతోంది. ఈ రెండేళ్ల కాలంలో అనేక అక్రమాలు, స్కామ్‌లు జరిగినా ప్రభుత్వం నుంచి కనీస స్పందన కరువైంది. రేయనక పగలనక కష్టపడి చదివిన అభ్యర్థుల ఉద్యోగాలను గెద్దల్లా తన్నుకుపోయి అమ్మేసుకున్నారు. చివరికి జాతీయ స్థాయిలో గోల్డ్ మెడల్ సాధించిన వ్యక్తికి కూడా స్పోర్ట్స్ కోటాలో ఉద్యోగం రాలేదంటే ఏపీలో డిఎస్సీ ఎంత పెద్ద కుంభకోణమో అర్థమవుతోంది.

**- ప్రశ్నిస్తే అణచివేత, లాటీఛార్జీలు..**

డిఎస్సీ అక్రమాలపై ఆధారాలతో నిలదీస్తే సమాధానం చెప్పకపోగా ఎదురుదాడి చేస్తున్నారు. సమస్యలపై నోరెత్తిన విద్యార్థులు, నిరుద్యోగులపై లాటీలు జులిపిస్తూ, బూటు కాళ్లతో తన్నుతూ అక్రమ కేసులు పెడుతున్నారు. ఢిల్లీ జంతర్ మంతర్ 'చలో సంసద్' తరహాలోనే ఏపీలో 'చలో అసెంబ్లీ' పిలుపు రాకముందే విద్యాశాఖ మంత్రిగా నారా లోకేష్ రాజీనామా చేయాలి. విద్యాశాఖ మంత్రిగా లోకేష్ పూర్తిగా వైఫల్యం చెందారు.

కేంద్రంలో నీట్ పేపర్ లీకేజీపై స్పందించి చర్యలు తీసుకున్నప్పుడు, ఏపీలో డిఎస్సీ కుంభకోణంపై ఎందుకు చర్యలు తీసుకోరు? తక్షణమే డిఎస్సీ అక్రమాలపై సీబీఐ విచారణ జరిపించి దోషులను కఠినంగా శిక్షించాలి.

**- ప్రచార ఆర్భాటం -- పెట్టుబడులపై అసలు నిజాలు..**

రాష్ట్రానికి రూ.23 లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చాయని పచ్చ మీడియాతో కలిసి అబద్ధపు ప్రచారం చేస్తున్నారు. పార్లమెంట్ సాక్షిగా కేంద్ర మంత్రి చెప్పిన దాన్ని బట్టి వచ్చింది కేవలం ?6,962 కోట్లు మాత్రమే. 25 లక్షల ఉద్యోగాలు ఇచ్చామని చెబుతున్న వీళ్లు, కనీసం 20 వేల ఉద్యోగాలు కూడా ఇవ్వలేదు. నిరుద్యోగ భృతి లేదు, లాయర్లకు స్టైఫండ్ లేదు, విద్యార్థులకు ఫీజ్ రీయింబర్స్మెంట్ రాదు. పాఠశాలల్లో ఫుడ్ పాయిజన్, ఆస్పత్రుల్లో వైద్యం అందక మరణాలు... ఇలా ఏ ఒక్క వర్గానికి కూడా ఈ ప్రభుత్వం న్యాయం చేయలేకపోయింది.

**- కూటమి గుండెల్లో వణుకు పుట్టిస్తాం..**

అధికార మదంతో ప్రవర్తిస్తే యువత తలుచుకుంటే మిమ్మల్ని పరిగెత్తించడం ఖాయం. యువత అంతా ఒక్కటై రానున్న రోజుల్లో మీ ఇంటిని, అసెంబ్లీని ముట్టడించడం ఖాయం. కచ్చితంగా డియస్సీ అక్రమాలపై సీబీఐ విచారణ జరిపించాలి. డియస్సీలో అక్రమార్కులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. లేని పక్షంలో వైయస్సార్సీపీ అధ్యక్షుడు వైయస్.జగన్ ఆదేశాల మేరకు పార్టీ యువజన, విద్యార్థి విభాగాల ఆధ్వర్యంలో మరింత ఉధృతంగా ఆందోళనను చేపట్టడం ఖాయమని కొండా రాజీవ్ గాంధీ హెచ్చరించారు.

## డీఎస్సీ అక్రమాలపై తక్షణమే సీబీఐ విచారణ జరిపించాలి

- విచారణ పూర్తయ్యే వరకు సంబంధిత మంత్రులు రాజీనామా చేయాలి.
- శాసనమండలి విపక్ష నేత, మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ డిమాండ్
- విజయనగరంలో మాజీ ఎమ్మెల్యే బొత్స అప్పలనర్సయ్య నివాసంలో మీడియాతో మాట్లాడిన శాసనమండలి విపక్ష
- నేత, మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ.
- ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు వెంటనే విడుదల చేయాలి
- విద్యార్థుల భవిష్యత్తును పరిరక్షించాలి
- విమానాశ్రయానికి అన్ని అనుమతులు తెచ్చింది వైయస్సార్సీపీ ప్రభుత్వమే
- నిబంధనల ప్రకారమే విజయనగరంలో మా పార్టీ కార్యాలయానికి భూకేటాయంపులు
- శంకర్ ఫౌండేషన్ కు కేటాయించిన విధంగానే భూ కేటాయింపులు
- దీనిపై అనవసర రాద్ధాంతం తగదు
- తేల్చి చెప్పిన బొత్స సత్యనారాయణ.

**విజయనగరం పెన్ సత్తా, జులై 26: :** రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం ప్రజా సమస్యలను, విద్యార్థుల భవిష్యత్తును గాలికొదిలేసి ఒంటెద్దు పోకడలు, అవినీతి నిర్ణయాలతో పాలన చేస్తోందనిశాసనమండలి విపక్ష నేత, మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ ఆగ్రహం వ్యక్తం చేశారు. విజయనగరంలో మాజీ ఎమ్మెల్యే బొత్స అప్పలనర్సయ్య నివాసంలో జరిగిన పత్రికా సమావేశంలో ఆయన మాట్లాడుతూ డీఎస్సీ పరీక్షల నిర్వహణలో చోటుచేసుకున్న తీవ్ర అవకతవకలపై సీబీఐ విచారణ జరిపించాలని, రూ. 10 వేల కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అలాగే ఎన్నికల్లో హామీ ఇచ్చిన నిరుద్యోగ భృతిని అమలు చేయకపోవడంపై మండిపడ్డారు. భోగాపురం విమానాశ్రయ భూసేకరణతో పాటు అన్ని అనుమతులు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలోనే విజయవంతంగా పూర్తయ్యాయని.. ఇందులో కూటమి ప్రభుత్వ గొప్పదనం ఏమీ లేదని తేల్చి చెప్పారు. మరోవైపు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయ స్థలం కేటాయింపులపై ప్రతిపక్షాలు చేస్తున్న విమర్శలను ఆయన తిప్పికొట్టారు. నిబంధనల మేరకే విజయనగరంలో పార్టీ కార్యాలయానికి భూమి కేటాయించారని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా ఆయన ఇంకా ఏమన్నారంటే...

**- డీఎస్సీ అక్రమాల పై -- సీబీఐ ఎంక్వయిరీ వెయ్యాలి.**

సుమారు 3 లక్షల మంది నిరుద్యోగ అభ్యర్థులు హాజరైన డీఎస్సీ పరీక్షల నిర్వహణలోనూ, ఫలితాల్లో తీవ్ర అవకతవకలు జరిగాయి. ప్రభుత్వంలో పారదర్శకత, నిరుద్యోగుల పట్ల నిజాయితీ ఉంటే డీఎస్సీ అక్రమాలపై తక్షణమే సీబీఐ విచారణకు ఆదేశించాలి. విచారణ పూర్తయ్యే వరకు సంబంధిత మంత్రులు తమ పదవులకు రాజీనామా చేసి, నిజాయితీ నిరూపించుకున్నాకే మళ్లీ ప్రభుత్వంలోకి రావాలి.

డిఎస్సీలో పరీక్షల ముందు ఒక జీఓ, పరీక్షల తర్వాత మరొక జీఓ తెస్తూ తమకు నచ్చిన వారికి అపాయింట్‌మెంట్లు ఇచ్చేలా జీఓ నంబర్ 4, జీఓ నంబర్ 47 లలో సవరణలు చేస్తూ నిరుద్యోగుల జీవితాలతో చెలగాటమాడారు. స్పోర్ట్స్ కోటా నిబంధనలను కూడా సవరించి, దారి మళ్లించి తమ వర్గానికి చెందిన వారికి లబ్ధి చేకూర్చేలా అక్రమాలకు పాల్పడ్డారు.



**- రూ. 10 వేల కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు -- విద్యార్థుల భవిష్యత్తు ప్రశ్నార్థకం.**

స్వర్గీయ వైఎస్సార్ ఆలోచన నుంచి వచ్చిన ఫీజు రీయింబర్స్‌మెంట్, విద్యా దీవెన, వసతి దీవెన పథకాల కింద ఈ ప్రభుత్వం రూ.10 వేల కోట్లు బకాయిలు పెట్టింది. గతంలో ముఖ్యమంత్రులుగా పనిచేసిన రోశయ్య, కిరణ్ కుమార్ రెడ్డి, అలాగే 2014లో వచ్చిన చంద్రబాబు ప్రభుత్వం కూడా ఈ పథకాన్ని ఆపకుండా కొనసాగించాయి. ఇప్పుడు మాత్రం అదే చంద్రబాబు ప్రభుత్వం ఫీజు బకాయిలు చెల్లించకపోవడంతో ప్రైవేటు మరియు ప్రభుత్వ కళాశాలలు విద్యార్థులకు సర్టిఫికెట్లు ఇవ్వడం లేదు. సర్టిఫికెట్లు లేక నిరుద్యోగులు ఉద్యోగాలకు ఎలా దరఖాస్తు చేసుకుంటారు?

ప్రభుత్వానికి కాంట్రాక్టర్ల బిల్లులు చెల్లించడానికి డబ్బులున్న ప్రభుత్వానికి... విద్యార్థుల ఫీజు బకాయిలు చెల్లించడానికి మాత్రం మనసు రావడం లేదు.

**- నిరుద్యోగ భృతి ఏది -- 'నాడు-నేడు' పాఠశాలల నిర్వీర్యం.**

ఎన్నికల సమయంలో 'బాబు వస్తే జాబ్.. లేకపోతే నిరుద్యోగ భృతి' అని పెద్ద ఎత్తున ప్రచారం చేశారు. అధికారంలోకి వచ్చి రెండేళ్లు దాటినా ఏ ఒక్కరికైనా నిరుద్యోగ భృతి ఇచ్చారా?" వైఎస్ జగన్ హయాంలో 'నాడు-నేడు' కింద ఎంతో అద్భుతంగా తీర్చిదిద్దిన పాఠశాలల నిర్వహణను ప్రభుత్వం పూర్తిగా గాలికొదిలేసింది.

**- భోగాపురం విమానాశ్రయం వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ కృషి ఫలితమే.**

గత టీడీపీ ప్రభుత్వం భోగాపురం ఎయిర్‌పోర్ట్ కోసం 15,000 ఎకరాలు అడిగి రైతుల నుంచి తీవ్ర వ్యతిరేకత తెచ్చుకుంది. మా ప్రభుత్వ హయాంలో వైఎస్ జగన్ కేవలం 2,700 ఎకరాల భూమిని పారదర్శకంగా సేకరించి, ఎయిర్‌పోర్ట్‌కు 2,200 ఎకరాలు కేటాయించి పనులు వేగవంతం చేశారు. ఈ నేపథ్యంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ భోగాపురం విమానాశ్రయ ప్రారంభోత్సవానికి రావడం సంతోషకరం, ఈ సందర్భంగా జిల్లా అభివృద్ధికి ఆయన ప్రత్యేక వరాలు ప్రకటించాలి.

విమానాశ్రయ ప్రారంభోత్సవం ముగిసిన తర్వాత, ఆగస్టు 1 నాటికి ఈ ప్రభుత్వం చేసిన మోసాలపై బహిరంగ సభ ఏర్పాటు చేసి ప్రజాక్షేత్రంలో నిజాలు వెల్లడిస్తాం.

**- మాన్సాస్ ఆస్తులు, పార్టీ ఆఫీస్ స్థలంపై స్పష్టత..**

విజయనగరంలో పూర్వం నుంచి ఉన్న ఆస్తులన్నీ మహారాజు గారి పేరు మీద ఉన్న విషయాన్ని మేమందరం గౌరవించి అంగీకరించాం. రాజభరణాల రద్దు వంటి అంశాలన్నీ అందరికి తెలుసు. అదే విధంగా మాన్సాస్ ట్రస్ట్‌లో అవకతవకలు జరుగుతున్నాయని వారి సోదరుడు ఆనందగజపతిరాజు ఉన్నప్పుడు... దాన్ని ప్రభుత్వంలో కలపాలని గతంలో అశోక్ గజపతిరాజు గారే లేఖ రాసిన మాట వాస్తవం కాదా?. శంకర్ ఫౌండేషన్ సంస్థకు ప్రభుత్వం స్థలం ఇచ్చినట్లే, వైఎస్సార్‌సీపీ కార్యాలయానికి కూడా నిబంధనల ప్రకారమే ప్రభుత్వ స్థలాన్ని కేటాయించారు. ప్రతిదాన్నీ రాజకీయ లబ్ధి కోసం వాడుకోవడానికి ప్రయత్నించకుండా నాయకులు తమ గౌరవాన్ని కాపాడుకోవాలి. .ఒకరి వైపు వేలు చూపించే ముందు తమ గత చరిత్రను, తమ కింద ఉన్న మచ్చలను తెలుసుకోవాలని గుర్తు చేశారు. అదే విధంగా వ్యవసాయం అంటే చంద్రబాబుకి గిట్టదని.. మరే రాష్ట్రంలోని లేని విధంగా ఏపీలో ఎరువుల కొరత ఎందుకు వచ్చిందిని ప్రశ్నించారు.

# జగన్ బ్యాచ్: పార్లమెంటును వాడేసుకుంటున్నారు..!

వైసీపీ అధినేత జగన్ చెప్పినట్టుగానే.. పార్లమెంటు సభ్యులు ఉభయ సభలను కూడా వాడేసుకుంటున్నారా? తద్వారా.. కీలక అంశాలపై వైసీపీ బలమైన గళమే వినిపిస్తోందా? అంటే.. ఔనని అంటున్నారు వైసీపీ నాయకులు. పార్లమెంటు వర్షాకాల సమావేశాలు.. గత సోమవారం ప్రారంభమయ్యాయి. ఈ సమావేశాల్లో వాస్తవానికి కాక్రోచ్ జనతా పార్టీ చేపట్టిన ఉద్యమం.. పార్లమెంటులో ప్రతిపక్షాలు చేస్తున్న ఆందోళన వంటివి ప్రధానంగా చర్చకు వస్తున్నాయి. దీంతో అసలు సభలే జరగడం లేదు. అయినప్పటికీ.. వైసీపీ సభ్యులు మాత్రం తమ గళాన్ని వినిపిస్తుండడం గమనార్హం. అయితే.. ఇక్కడ చిత్రం ఏంటంటే.. జాతీయస్థాయిలో జరుగుతున్న విద్యార్థుల ఆందోళనలను వైసీపీ ఓన్ చేసుకోలేదు. పైగా స్పందించడం కూడా లేదు. పార్లమెంటులో ఇతర పక్షాలు ఈ విషయాన్ని ప్రధానంగా చర్చకు పెడుతుండగా.. వైసీపీ మాత్రం దీనికి భిన్నంగా వ్యవహరిస్తోంది. పోనీ.. రాష్ట్రంలో ఉన్న సమస్యలనైనా ప్రస్తావిస్తోందా? అంటే అది కూడా లేదు.కేవలం కూటమి ప్రభుత్వం తప్పులను ఎత్తి చూపించేందుకు.. కేంద్రం నోటి నుంచే చెప్పించేందుకు ప్రయత్నిస్తోంది. ఇది ఒకరకంగా కూటమికి ఇబ్బందికర పరిణామంగా మారింది. లోక్సభ, రాజ్యసభల్లో జరుగుతున్న ప్రశ్నోత్తరాల సమయంలో ఏపీకి సంబంధించి.. ముఖ్యంగా గత రెండేళ్ల కాలంలో కూటమి ప్రభుత్వం చేస్తున్న పనులకు సంబంధించిన ప్రశ్నలు అడుగుతున్న వైసీపీ సభ్యులు.. వాటిపై కేంద్రం నుంచే సమాధానాలు రాబడుతున్నారు. తద్వారా.. తమ గ్రాఫ్ పెరుగుతుందని అంచనా వేస్తున్నారు.

**కానీ వాస్తవం ఏంటి..?**



పార్లమెంటు ద్వారా వైసీపీ చేస్తున్న ఈ ప్రయోగం.. పార్టీపరంగా నేతలకు సంతోషాన్ని ఇచ్చే విషయం అయితే కావొచ్చు. కానీ, ప్రజలు వీటిని పెద్దగా పట్టించుకోవడం లేదు. పైగా వైసీపీపై ఏర్పడిన వ్యతిరేక భావన ప్రజల్లో ఇప్పటికీ అలానే ఉంది. దీంతో వైసీపీ చేస్తున్న పార్లమెంటు ప్రయోగం పెద్ద గా ఫలించే అవకాశం లేదని కూటమి నాయకులు అంచనా వేస్తున్నారు. దీంతో కూటమి ఎదురు దాడి చేయడం దాదాపు తగ్గించేసింది. పార్లమెంటు ప్రశ్నల సమయంలో మౌనంగా ఉంటోంది. మరి వైసీపీ దీనినే మైలేజీ అనుకుంటుందా? అనేది చూడాలి.

# 'ఇంటి గుట్టు' విషయంలో టీడీపీనే బెటరంట..!



: ఇంటి గుట్టు.. బయటకు వస్తే.. ఎంతటి వారికైనా ప్రమాదమే. అది వ్యక్తిగతమైనా.. రాజకీయాలైనా అంతే. ఈ విషయంలో టీడీపీలో ఉన్న కట్టుబాటు.. ఇతర పార్టీల్లో కొంత మేరకు తక్కువగానే ఉందన్నది వాస్త వం. టీడీపీలో ఏ నిర్ణయం తీసుకున్నా.. అది అధినేత నోటి నుంచి బయటకు వచ్చే వరకు నాయకులు బహిరంగ పరచడం లేదు. అంతేకాదు.. దీనిపై డిస్కషన్స్ కూడా ఉండవు. ఎక్కడా నోరు జారుతున్న నాయకులు కూడా టీడీపీలో కనిపించరు.

ఫలితంగా అధినేత తీసుకునే నిర్ణయాలు.. ఆయన నోటి నుంచే బయటకు వస్తున్నాయి. ఎక్కడైనా ఒక రిద్దరు బయటకు చెప్పేసే అలవాటు ఉన్న నాయకులు కనిపిస్తే.. వారిని తమదైన శైలిలోనే నియంత్రిస్తు న్నారు. కీలక సమావేశాలకు కూడా పిలవకుండా జాగ్రత్త పడుతున్నారు. పార్టీ పరంగా అవలంభించే వ్యూహాలు.. వేసే ఎత్తుగడలు వంటివి పెద్ద ఎత్తున వర్కవుట్ అవ్వాలంటే.. ముందుగానే రిలీవ్ అయితే ఇబ్బంది అన్న విషయాన్ని తమ్ముళ్లు గ్రహించారు.

ముఖ్యంగా ప్రత్యర్థులకు ఆయుధాలు ఇవ్వకుండా జాగ్రత్తలు పడుతున్నారు. ఇక, వైసీపీ విషయానికి వస్తే.. ఇది ఇబ్బందికరంగా మారుతోంది. గత ప్రభుత్వంలో చేసిన తప్పులను కొందరు ఇంకా మరిచిపో లేక పోతున్నారు. వాస్తవానికి టీడీపీ ఈ విషయాలను గుర్తు చేస్తూనే ఉంది. కానీ, దీనికి తోడు వైసీపీ నుంచి కూడా అదే తరహాలో మాటల తూటాలు బయటకు వస్తున్నాయి. మనం తప్పు చేశాం.. అంటూ.. కొందరు నాయకులు మనసులో ఉన్న మాటను దాచుకోలేక పోతున్నారు.

ఉత్తరాంధ్ర నుంచి కర్నూలు వరకు కొందరు నాయకులు సొంత పార్టీ తప్పులను ప్రస్తావిస్తున్నారు. అంతే కాదు.. మనకన్నా.. టీడీపీనే పనిచేస్తోందని బహిరంగ వ్యాఖ్యలు చేస్తున్నారు. వాస్తవానికి ఇలాంటి అభిప్రా యాలు ఉండడం తప్పుకాదు. అయితే.. వీటిని అంతర్గత వేదికలపైనే నాయకులు చర్చించాలి. దీనికి భిన్నంగా నాయకులు బహిరంగ వేదికలపైనే ఇలాంటి కామెంట్స్ చేస్తుండడంతో వైసీపీకి తీరని ఇబ్బంది వస్తోందని పార్టీలోని మరికొందరు నాయకులు చెబుతున్నారు.

**ఎందుకిలా..?**

నాయకులు ఇలా రోడ్డున పడిపార్టీ గురించి మాట్లాడడానికి కీలకమైన రెండు కారణాలు ఉన్నాయి.

1) ఇతర నేతలు చెప్పిన విషయాలను జగన్ పట్టించుకోకపోవడం. ఫలితంగా వారు ఎలానూ తమకు చెప్పే అవ కాశం లేదని భావిస్తున్న నేపథ్యంలో మనసులో మాటను బహిరంగ వేదికలపైనే చెబుతున్నారు. .అంతేకా దు.. పార్టీ అధినేతపై ఉన్న అక్కసు కూడా దీనికి కారణం.

2) తమకు చెప్పే అవకాశం లేకపోవడం. పార్టీలో అంతర్గత చర్చలకు జగన్ అసలు ప్రాధాన్యం ఇవ్వడం లేదు. దీంతో నాయకులకు తమ అభిప్రాయాలను పంచుకునే వెసులుబాటు లేకుండా పోయింది. ఇదికూడా ఇంటి గుట్టును బయట పడేసేలా చేస్తోందన్న వాదన వచ్చేలా చేసింది.

# 'నగర' వైసీపీ డీలా పడుతోందా...?

రాష్ట్ర వ్యాప్తంగా వైసీపీ పుంజుకుంటోంది.. ఎప్పుడు ఎన్నికలు జరిగినా.. మా పార్టీదే ఘన విజయం అంటూ.. ఆ పార్టీ నాయకులు చెబుతున్నారు. అయితే.. వాస్తవం ఏంటి? నిజంగానే పార్టీ పుంజుకుందా? అనేది కీలక అంశం. ఎన్నికలు జరిగి రెండేళ్లు దాటిపోయిన దరిమిలా.. పార్టీ పరిస్థితిని అంచనా వేసుకునే మెకానిజం ఇప్పటికీ వైసీపీలో కనిపించడం లేదు. ఇది ప్రధానంగా పార్టీని ఇబ్బందిలోకి నెడుతోంది. ఇక, ఇప్పటి వరకు ఉన్న అంచనాల ప్రకారం.. జిల్లాల స్థాయిని పక్కన పెడితే.. నగరాల్లో వైసీపీ పరిస్థితి ఇబ్బందుల్లోనే ఉంది.

థర్డ్ పార్టీ చేస్తున్న సర్వేల్లో నగరాల్లో వైసీపీ పరిస్థితి దారుణంగానే ఉందని స్పష్టమవుతోంది. ప్రతి జిల్లాకు ఒక కీలక నగరం ఉంటుంది. ఇలా చూసుకుంటే.. ఆయా నగరాల్లో ప్రతిఫలించే రాజకీయమే జిల్లా వ్యాప్తంగా ప్రభావం చూపుతుంది. పైగా కీలక నాయకులు అందరూ నగరాల్లోనే ఉంటారు. నియోజకవర్గాలు ఏవైె నా కూడా నగరాల్లోనే రాజకీయాలు సాగుతాయి. కానీ, నగరాల్లోనే వైసీపీ వీక్గా ఉందని లెక్కలు వస్తున్నా యి. ఒకటి రెండు కాదు.. దాదాపు అన్ని నగరాల్లోనూ పార్టీ పెద్దగా యాక్టివ్ పాలిటిక్స్ చేయడం లేదు. వైసీపీ అధినేత సొంత జిల్లా కడపలోని కడప నగరంలో ఒకప్పుడు అంజాద్ బాషా రాజకీయాలు



చేసేవారు. ఆయన ఫ్యామిలీపై కేసులు నమోదు కావడంతో సైలెంట్ అయ్యారు. ఎన్టీఆర్ జిల్లాలో కీలకమైన విజయ వాడలో కూడా ఇలాంటి పరిస్థితే ఉంది. ఇక, ఉమ్మడి కృష్ణాజిల్లాలోని మచిలీపట్నంలో మాత్రమే మాజీ మంత్రి పేర్ని వాయిస్ వినిపిస్తోంది. గుంటూరు నగరంలోనూ ఒకరిద్దరు నాయకులు మాత్రమే మాట్లాడుతున్నారు. తిరుపతి, కర్నూలు, విజయనగరం, విశాఖపట్నం వంటి కీలక నగరాల్లోనూ పార్టీ సుప్తచేతనావస్థలో ఉంది.ఒక్క రాజమండ్రిలో మాత్రం మాజీ ఎంపీ భరత్ పార్టీని జాగ్రత్తగా లీడ్ చేస్తున్నారు. ఇక, ఏలూరు వంటి కీ లక నగరంలో నాయకుల లేమి పార్టీకి ఇబ్బందిగా మారింది. అలాగే, అనంతపురంలో నాయకులు

ఆత్మర క్షణంలో పడ్డారు. శ్రీకాకుళంలో వివాదాలు కొంప ముంచుతున్నాయి. నెల్లూరు నగరంలో రాజకీయాలు ఎవరికి వారివే అన్నట్టుగా కొనసాగుతున్నాయి. ఇలా.. నగరాల్లోనే పార్టీ పరిస్థితి దారుణంగా ఉంటే.. ఇతర ప్రాంతాల్లో పరిస్థితి ఏంటన్నది చూడాలి.

# వైరల్ తుఫాన్ సృష్టించిన సీజేపీ.. 10 గంటల్లో 12 కోట్ల వ్యూస్ షాక్!

నీట్ యూజీ పేపర్ లీకేజీ వ్యవహారంపై దేశవ్యాప్తంగా పోరాటం చేసి అందరి దృష్టినీ ఆకర్షించిన కాక్రోచ్ జనతా పార్టీ ఇప్పుడు సోషల్ మీడియాలో సంచలనం సృష్టిస్తోంది. ఈ ఉద్యమానికి సంబంధించిన ఒక వీడియో ఇన్‌స్టాగ్రామ్‌లో అప్‌లోడ్ చేసిన కేవలం 10 గంటల్లోనే ఏకంగా 12 కోట్ల (120 మిలియన్ల) వ్యూస్ సాధించి సరికొత్త రికార్డు నెలకొల్పింది. ప్రస్తుతం ఈ వైరల్ వీడియో ఇంటర్నెట్‌ను ఊపేస్తూ తీవ్ర చర్చనీయాంశంగా మారింది.

**ఆ వీడియోలో ఏముంది? వైరల్ అయింది ఎలా?:**

కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేస్తున్నారనే వార్త సీజేపీ వ్యవస్థాపకుడు అభిజిత్ దిప్కేకు ఫోన్‌లో అందిన క్షణాలను ఈ వీడియోలో చిత్రీకరించారు. ఇక ఆ నిమిషంలో వారి స్పందన, ఎమోషన్‌ను ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేయగానే నెటిజన్లు బ్రహ్మరథం పట్టారు. కేంద్ర ప్రభుత్వాన్ని సైతం ఆలోచనలో పడేసిన ఈ ఉద్యమం క్రేజ్ సోషల్ మీడియాలో ఎంత రేంజ్‌లో ఉందో ఈ వ్యూస్ సునామీ నిరూపించింది.

**2.2 కోట్ల ఫాలోవర్లు.. యువతలో విపరీతమైన ఆదరణ:**

నీట్ పేపర్ లీకేజీకి నిరసనగా మొదలైన ఈ విద్యార్థి ఉద్యమం చాలా తక్కువ సమయంలోనే దేశవ్యాప్తంగా వ్యాపించింది. రాయిటర్స్ నివేదికల ప్రకారం సీజేపీ ఇన్‌స్టాగ్రామ్ పేజీకి ఇప్పటికే దాదాపు 2.2 కోట్ల (22 మిలియన్లు) మంది ఫాలోవర్లు రావడం విశేషం. ఇక ముఖ్యంగా యువత, విద్యార్థులు తమ నిరసనను వ్యక్తం చేయడానికి, సమాచారాన్ని పంచుకోవడానికి ఇన్‌స్టాగ్రామ్‌ను ప్రధాన వేదికగా మార్చుకున్నారు.

**సోషల్ మీడియా పవర్.. విశ్లేషకుల అభిప్రాయం:**

ఈ రేంజ్ వ్యూస్, లైక్స్ చూస్తుంటే భారత రాజకీయాల్లో, ప్రజా ఉద్యమాల్లో సోషల్ మీడియా ప్రభావం ఏ స్థాయిలో ఉందో అర్థమవుతోందని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. అయితే, డిజిటల్ మీడియాలో వచ్చే వ్యూస్ ప్రతిసారీ ఓట్లుగా లేదా పూర్తిస్థాయి రాజకీయ మద్దతుగా మారకపోవచ్చు, కానీ ప్రజల్లో ముఖ్యంగా యువతలో ఆలోచన రేకెత్తించడానికి ఇవి ఎంతగానో ఉపయోగపడతాయని విశ్లేషిస్తున్నారు.

**ప్రత్యక్ష రాజకీయాల్లోకి వస్తారా?:**

ఇంతటి ఆదరణ పొందుతున్న ఈ కాక్రోచ్ జనతా పార్టీ ప్రత్యక్ష రాజకీయాల్లోకి అడుగుపెడుతుందా అనే ప్రశ్నపై సీజేపీ ప్రతినిధి అశుతోష్ రంకా ఆసక్తికరంగా స్పందించారు. ఇక "భారత్‌లో దేనికీ 'నో' అని చెప్పలేం.. అయితే ప్రస్తుతం మా ఫోకస్ అంతా ఈ విద్యార్థి ఉద్యమాన్ని మరింత బలోపేతం చేసి బాధితులకు న్యాయం జరిపించడంపైనే ఉంది" అని ఆయన స్పష్టం చేశారు.

**డిజిటల్ యుగంలో విద్యార్థి శక్తి:**

ఈ ఘటన సోషల్ మీడియా శక్తి ఏంటో మరోసారి నిరూపించింది. సరైన విషయం మీద యువత కలిసివస్తే, పెద్ద రికార్డులైనా సులభంగా మార్చగలరని సీజేపీ వ్యూస్ గ్రాఫ్ చెబుతోంది. రాబోయే రోజుల్లో ఈ సీజేపీ ఉద్యమం ఎలా మారుతుందో, డిజిటల్‌గా మొదలైన ఈ పోరాటం ఏ ఫలితాలు ఇస్తుందో చూడాలి.

# పాక్‌తో ముచ్చట్లు ఉండవ్.. పీవోకే కోసమే భవిష్యత్తు చర్చలు : రాజ్ నాథ్ కీలక వ్యాఖ్యలు



మిలట్రీకి మిలిటెన్సీకి తేడా లేని పాకిస్థాన్ తో చర్చలు జరిపే ప్రసక్తే లేదని రక్షణ మంత్రి రాజ్ నాథ్ సింగ్ స్పష్టం చేశారు. 27వ కార్గిల్ విజయ్ దివస్ వేడుకల సందర్భంగా లడఖ్‌లోని ద్రాస్ లో ఉన్న కార్గిల్ వార్ మెమోరియల్ ను ఆయన ఆదివారం సందర్శించారు. ఈ సందర్భంగా రక్షణ మంత్రి మాట్లాడుతూ పొరుగు దేశం పాకిస్థాన్‌పై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. పాకిస్థాన్ తన నైజాన్ని, వక్రబుద్ధిని ఎప్పటికీ మార్చుకోలేదని, భారత్‌కు వ్యతిరేకంగా పరోక్ష యుద్ధాలు (ప్రాక్సీ వార్), ఉగ్రవాదాన్ని ప్రోత్సహిస్తూనే ఉందని ఆయన మండిపడ్డారు. దేశ సరిహద్దుల రక్షణలో భారత సాయుధ బలగాలు అత్యంత అప్రమత్తంగా ఉన్నాయని, శత్రువుల ఏ చిన్న దుశ్చర్యకైనా వారి ఊహకు కూడా అందని రీతిలో గట్టి బదులిస్తామని హెచ్చరించారు.

కార్గిల్ యుద్ధంలో భారత సైనికులు చూపిన తెగువను, త్యాగాలను స్మరించుకుంటూ రక్షణ మంత్రి ప్రసంగం కొనసాగింది. 1999 నాటి ఆ యుద్ధంలో మైనస్ డిగ్రీల చలిలో, ఆక్సిజన్ కొరత ఉన్న కఠినమైన పర్వత ప్రాంతాల్లో సైతం మన జవాన్లు శత్రువుల భరతం పట్టారని కొనియాడారు. కార్గిల్ శిఖరాలపై త్రివర్ణ పతాకాన్ని ఎగరేసిన ఆ వీర సైనికుల సాహసం దేశ ప్రజల గుండెల్లో ఎప్పటికీ నిలిచి ఉంటుందని స్పష్టం చేశారు. నేడు దేశం అన్ని రంగాల్లో ముందుకు వెళ్తుంటే, పాకిస్థాన్ మాత్రం ఉగ్రవాదాన్ని పెంచిపోషించడమే పరమావధిగా పెట్టుకుందని విమర్శించారు. భారత్, పాకిస్థాన్ ల మధ్య ఉన్న వైవిధ్యాన్ని వివరిస్తూ రాజ్ నాథ్ సింగ్ కీలక వ్యాఖ్యలు చేశారు. భారత్ సాంకేతికత, నూతన ఆవిష్కరణలు, డిజిటలైజేషన్ వంటి కార్యక్రమాలతో అభివృద్ధి బాటలో పయనిస్తుంటే.. పాకిస్థాన్ మాత్రం అక్రమ చొరబాట్లు, ఉగ్రవాద డిజైన్ల తయారీపైనే దృష్టి పెట్టిందని ఎద్దేవా చేశారు. భారత్ అధునాతన యుద్ధ నౌకలను, సాంకేతిక పరిజ్ఞానాన్ని డిజైన్ చేస్తుంటే, పాకిస్థాన్ సరిహద్దుల్లో ఉగ్రవాదాన్ని డిజైన్ చేయడంలో నిమగ్నమైందని ఆయన ఘాటుగా విమర్శించారు. దేశాభివృద్ధిని చూసి ఓర్వలేక కుట్రలు పన్నుతున్న శక్తులకు భారత సైన్యం తగిన బుద్ధి చెబుతుందని హెచ్చరించారు. పాకిస్థాన్‌తో భవిష్యత్తులో జరిగే చర్చల స్వభావంపై రక్షణ మంత్రి స్పష్టమైన వైఖరిని ప్రకటించారు. ఆ దేశంతో ఇకపై ఎలాంటి సాధారణ ద్వైపాక్షిక చర్చలకు అవకాశం లేదని, ఒకవేళ భవిష్యత్తులో చర్చలు జరిగితే అది కేవలం పాకిస్థాన్ ఆక్రమిత కశ్మీర్ (పీఓకే) గురించే ఉంటాయని తేల్చిచెప్పారు. పీవోకే అనేది చట్టవిరుద్ధంగా పాక్ చెరలో ఉన్న భారత భూభాగమని, దానిని తిరిగి పొందే అంశంపైనే చర్చలు ఉంటాయని స్పష్టం చేశారు. పాకిస్థాన్ ప్రభుత్వ విధానంలోనే ఉగ్రవాదం ఒక భాగంగా మారిపోయిందని, అక్కడ సైన్యానికి, ఉగ్రవాదులకు మధ్య ఎలాంటి తేడా లేకుండా పోయిందని ఆరోపించారు. ఉగ్రవాద సంస్థలను పాక్ ప్రభుత్వమే కాపాడుతూ, దగ్గరుండి నడిపిస్తోందని ఆయన దుయ్యబట్టారు. ఈ వేడుకల్లో లడఖ్ లెఫ్టినెంట్ గవర్నర్ వినయ్ కుమార్ సక్సేనా, ఆర్మీ చీఫ్ జనరల్ ధీరజ్ సేథ్ తదితర ప్రముఖులు పాల్గొని వీరజవాన్లకు ఘనంగా శ్రద్ధాంజలి ఘటించారు. ద్రాస్‌లో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమాలలో పాల్గొన్న రక్షణ మంత్రి రాజ్ నాథ్ సింగ్, కార్గిల్ యుద్ధంలో ప్రాణాలు కోల్పోయిన అమరవీరుల కుటుంబ సభ్యులను స్వయంగా కలుసుకుని సత్కరించారు. దేశ రక్షణలో ప్రాణాలర్పించిన వారి త్యాగాలు చిరస్మరణీయమని పేర్కొన్నారు. దేశం రక్షణ రంగంలో 'ఆత్మనిర్భర్ భారత్' దిశగా అడుగులు వేస్తోందని, స్వదేశీ పరిజ్ఞానంతో అత్యాధునిక ఆయుధాలను తయారు చేసుకుంటున్నామని తెలిపారు. రాబోయే కాలంలో ప్రపంచంలోనే అత్యుత్తమ బలమైన సైన్యంగా మన త్రివిధ దళాలు నిలుస్తాయని ఆయన పూర్తి విశ్వాసం వ్యక్తం చేశారు.

# 114 రఫేల్ యుద్ధ విమానాల డీల్

భారత వాయుసేన యుద్ధ సామర్థ్యాన్ని గణనీయంగా పెంచే దిశగా తలపెట్టిన 114 రఫేల్ ఫైటర్ జెట్ల మెగా ఒప్పందంలో కీలక పరిణామం జరిగింది. ఈ ప్రాజెక్టుకు సంబంధించి భారత ప్రభుత్వం ఈ ఏడాది మే నెలలో పంపిన లెటర్ ఆఫ్ రిక్వెస్ట్‌కు ఫ్రాన్స్ ప్రభుత్వం ఆగస్ట్ మధ్య నాటికి తన అధికారిక ప్రతిస్పందన తెలియజేయనుంది. రక్షణ శాఖ వర్గాల సమాచారం ప్రకారం మే నెలలో భారత్ పంపిన ప్రతిపాదనకు ఫ్రాన్స్ ఆగస్ట్ మధ్య వరకు సమయం కోరింది. ఫ్రాన్స్ నుంచి అధికారికంగా సమాధానం వచ్చాక ఇరు దేశాల మధ్య విమానాల ధర, రవాణా, సాంకేతిక పరిజ్ఞాన బదిలీ, దేశీయంగా తయారీ నిబంధనలపై ద్వైపాక్షిక చర్చలు వేగవంతం కానున్నట్లు తెలుస్తోంది.

**భారత్‌లోనే 94 రఫేల్స్ తయారీ**

ఈ ప్రాజెక్టులో అత్యంత కీలక అంశం 94 రఫేల్ విమానాల్ని భారత్‌లోనే తయారు చేయడం. ఫ్రాన్స్‌కు చెందిన డసాల్ట్ ఏవియేషన్ భారతీయ భాగస్వామ్య సంస్థతో కలిసి దేశీయంగా ఉత్పత్తి చేపట్టనుంది. మిగతా విమానాల్ని ఫ్రాన్స్ నుంచి నేరుగా సరఫరా చేస్తారు. ఇక్కడ మరో ముఖ్యమైన విషయం ఏంటంటే, ఫ్రాన్స్ వెలుపల తొలిసారి రఫేల్ యుద్ధ విమానాల తయారీ భారత్‌లోనే జరగనుంది. దీంతో 'మేక్ ఇన్ ఇండియా' కార్యక్రమానికి మరింత బలం చేకూరే అవకాశం ఉంది. ఇంకా భారత రక్షణ తయారీ రంగానికి ఇది కీలక మైలురాయిగా నిలవనుంది. ఈ ప్రాజెక్టు ద్వారా దాదాపు 50 శాతం లోకలైజేషన్ (స్వదేశీకరణ) సాధించొచ్చని



భావిస్తున్నారు. ఇంకా ఈ డీల్ ద్వారా భారతీయ సాంకేతికతతో తయారైన స్వదేశీ క్షిపణులు, ఆయుధ వ్యవస్థల్ని రఫేల్ విమానాల్లో సులభంగా సమీకరించే వెసులుబాటు కూడా భారత్‌కు లభిస్తుంది.

**తగ్గుతున్న స్క్వాడ్రన్ బలం- రఫేల్ అత్యవసరం!**


ప్రస్తుతం భారత వాయుసేన స్క్వాడ్రన్ బలం క్రమంగా తగ్గుతోంది. రష్యా సాంకేతికతకు చెందిన పాత మిగ్ రకం యుద్ధ విమానాల్ని దశలవారీగా సేవల నుంచి ఉపసంహరిస్తుండటం, మరోవైపు స్వదేశీ తేజస్ మార్క్-1ఏ, తేజస్ మార్క్- 2 విమానాల ఉత్పత్తి, సరఫరాలో జాప్యం ఎదురవుతోంది. ఇంకా ప్రస్తుతం వాయుసేనకు అవసరమైన 42.5 స్క్వాడ్రన్లకు బదులుగా కేవలం 29 స్క్వాడ్రన్లు మాత్రమే ఉండటంతో కొత్త యుద్ధ విమానాల అవసరం అత్యవసరంగా మారింది. ఈ నేపథ్యంలోనే కొత్త రఫేల్ విమానాల కొనుగోలు, భారత వాయుసేన సామర్థ్యాన్ని పెంచేందుకు కీలకంగా భావిస్తున్నారు.

2024లో రక్షణ శాఖ కార్యదర్శి రాజేశ్ కుమార్ సింగ్ బాధ్యతలు చేపట్టిన తర్వాత భారత వాయుసేన సామర్థ్యాన్ని మరింత పెంచే దిశగా సమగ్ర అధ్యయనం నిర్వహించారు. ఆ రిపోర్ట్ ఆధారంగా రక్షణ మంత్రిత్వ శాఖ ఈ ప్రాజెక్టును వేగంగా ముందుకు తీసుకెళ్తోంది. అలాగే డిఫెన్స్ అక్విజిషన్ కౌన్సిల్ కూడా 4 నెలల కిందటే భారత వాయుసేన ప్రతిపాదించిన 114 రఫేల్ జెట్ల కొనుగోలు ప్రతిపాదనకు ఆమోదం తెలిపింది. ఇప్పుడు ఫ్రాన్స్ అధికారిక స్పందన అనంతరం ఈ బిలియన్ డాలర్ల రక్షణ ఒప్పందం నెక్ట్స్ స్టేజ్‌లోకి ప్రవేశించనుంది.

**200 దాటనున్న రఫేల్ జెట్లు**

ప్రస్తుతం భారత వాయుసేన, భారత నౌకాదళం కలిసి 62 రఫేల్ విమానాలకు ఆర్డర్లు ఇచ్చాయి. తాజాగా 114 విమానాల ఒప్పందం పూర్తయితే దేశంలో రఫేల్ యుద్ధ విమానాల సంఖ్య 176 కు చేరుతుంది. అదనంగా భారత నౌకాదళం మరో 31 రఫేల్- మెరైన్ విమానాల్ని తీసుకోవాలని ఆసక్తి చూపడంతో ఇది కూడా పూర్తయితే భవిష్యత్తులో మొత్తం రఫేల్ యుద్ధ విమానాల సంఖ్య 200 దాటే అవకాశం ఉంది. ఈ 114 రఫేల్ జెట్ల కొనుగోలు డీల్ విలువ ఏకంగా రూ. 3.25 లక్షల కోట్ల వరకు ఉంటుందని అంచనా. ప్రస్తుతం భారత వాయుసేన దగ్గర 36 రఫేల్ యుద్ధ విమానాలు సేవల్లో ఉన్నాయి.

## భారత రైల్వేలో కొత్త శకం..




భారత రైల్వే చరిత్రలో ఒక కొత్త అధ్యాయం మొదలైంది. దేశీయంగా అభివృద్ధి చేసిన తొలి హైడ్రోజన్ రైలు తన ప్రయోగాత్మక పరుగును విజయవంతంగా పూర్తి చేసింది. 10 కోచ్‌ల ఈ రైలు 1,200 కిలోమీటర్లకు పైగా ప్రయాణించి, ఏకంగా 3,200 లీటర్ల డీజిల్ వినియోగాన్ని ఆదా చేసినట్లు రైల్వే మంత్రిత్వ శాఖ శనివారం ఒక ప్రకటనలో తెలిపింది. ఈ రైలు ప్రయాణ సమయంలో కర్బన ఉద్గారాలకు బదులుగా కేవలం నీటి ఆవిరిని మాత్రమే విడుదల చేయడం దీని ప్రత్యేకత. హైడ్రోజన్, ఆక్సిజన్ మధ్య రసాయన చర్య ద్వారా విద్యుత్‌ను ఉత్పత్తి చేసుకుంటూ ఈ రైలు నడుస్తుంది. దీనివల్ల పొగ గానీ, కర్బన ఉద్గారాలు గానీ వెలువడవు. ప్రస్తుతం అందుబాటులో ఉన్న రైలు రవాణా వ్యవస్థల్లో ఇది అత్యంత పర్యావరణ హితమైనదిగా నిలుస్తోంది. ఈ రైలులో 2,400 కిలోవాట్ల మొత్తం శక్తిని అందించే రెండు హైడ్రోజన్ పవర్ కార్లు, లిథియం ఐరన్ ఫాస్ఫేట్ బ్యాటరీలు, హైడ్రోజన్ సిలిండర్లు ఉన్నాయి. ప్రస్తుతం జింద్ - సోనిపట్ మధ్య ఈ రైలును విజయవంతంగా నడిపారు. త్వరలోనే ఢిల్లీ మార్గంలోనూ దీని ప్రయోగాత్మక పరుగులు ప్రారంభమవుతాయని అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్ మాట్లాడుతూ, ఈ రైలు సాంకేతికత పూర్తిగా స్వదేశీ అని, 'ఆత్మనిర్భర్ భారత్' దార్శనికతకు ఇది నిదర్శనమని అన్నారు. ఈ టెక్నాలజీకి సంబంధించిన మేథో సంపత్తి హక్కులను (శ్రా తీఅస్త్రప్త్రం) భారత్ నిలుపుకుందని, భవిష్యత్తులో ఇతర దేశాలకు ఎగుమతి చేసేందుకు మార్గం సుగమం అయిందని ఆయన వివరించారు.

# పాక్ చేసే ఎలాంటి దుస్సాహసానికైనా ఊహించని స్థాయిలో బదులిస్తాం

పాకిస్థాన్ ఎలాంటి దుస్సాహసానికి పాల్పడినా, అది ఊహించని స్థాయిలో భారత్ ప్రతిస్పందించే సామర్థ్యం కలిగి ఉందని కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ స్పష్టం చేశారు. భారత సార్వభౌమత్వాన్ని దెబ్బతీసే ప్రతి కుట్రకు ఇదే సమాధానమని హెచ్చరించారు. కార్గిల్ విజయ్ దివస్ 27వ వార్షికోత్సవం సందర్భంగా లద్ధాఖ్ ద్రాస్ సెక్టార్‌లోని యుద్ధ స్మారకం వద్ద రాజ్‌నాథ్ సింగ్ పుష్పగుచ్ఛం సమర్పించి వీర జవాన్లకు నివాళులర్పించారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో కార్గిల్ యుద్ధ స్మారక వర్చువల్ పోర్టల్‌ను కూడా ఆయన ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ భారత సైనికుల ధైర్యసాహసాలను కొనియాడారు.

కార్గిల్ యుద్ధం కేవలం సైనిక, దౌత్య విజయం మాత్రమే కాదని రాజ్‌నాథ్ సింగ్ అన్నారు. భారత జవాన్ల అజేయ సాహసం, అసాధారణ వీరత్వాన్ని ప్రపంచం మొత్తం చూసిన చారిత్రక ఘట్టమని పేర్కొన్నారు. కార్గిల్ యుద్ధంలో భారత సైనికులు ప్రదర్శించిన పరాక్రమం దేశ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయిందని, ప్రతి భారతీయుడు గర్వపడే విజయమని కొనియాడారు. ఇక ఇటీవల 'ఆపరేషన్ సిందూర్' విజయవంతంగా ఏడాది పూర్తి చేసుకున్న సందర్భంగా దానిని గుర్తు చేసుకున్నారు. ఆ ఆపరేషన్‌లో భారత సైనికులు, అధికారులు ఉగ్రవాదులకు, వారికి మద్దతు ఇచ్చే శక్తులకు మరచిపోలేని గుణపాఠం చెప్పారని అన్నారు. భారత్‌పై ఎలాంటి దుష్ప్రయత్నం జరిగినా దానికి మరింత కఠినంగా బదులిచ్చే శక్తి దేశానికి ఉందని స్పష్టం చేశారు. భారత సార్వభౌమత్వాన్ని సవాలు చేసే ప్రతి చర్యకు ఇదే ఫలితం



ఉంటుందని ఈ వేదిక నుంచే స్పష్టమైన సందేశం ఇస్తున్నానని పేర్కొన్నారు.


**దేశ ఐక్యతకు అమరులే నిదర్శనం**

కార్గిల్ యుద్ధ స్మారక స్థూపాన్ని పరిశీలిస్తే అది మొత్తం భారతదేశానికి ప్రతిబింబంగా కనిపిస్తుందని రాజ్‌నాథ్ సింగ్ అన్నారు. హిమాచల్‌ప్రదేశ్, నాగాలాండ్, మేఘాలయ, తమిళనాడు సహా దేశంలోని అన్ని ప్రాంతాలకు చెందిన అమర జవాన్ల పేర్లు అక్కడ కనిపిస్తాయని చెప్పారు. దేవాలయాలు, మసీదులు, గురుద్వారాలు, చర్చిలకు వెళ్లే వివిధ మతాలకు చెందిన సైనికులు దేశ రక్షణ కోసం ఒకటిగా పోరాడి ప్రాణత్యాగం చేశారని గుర్తు చేశారు. దేశాన్ని విభజించాలని కలలు కనే వారు ఈ అమరుల పేర్లు చెక్కిన గోడను చూడాలని, అదే వారి కుట్రలకు సమాధానమని వ్యాఖ్యానించారు.

**'తగిన సమాధానం ఇచ్చేందుకు పూర్తిగా సిద్ధం'**

'భారత్ సెమీకండక్టర్లను తయారు చేస్తుంటే, పాకిస్తాన్ ఆత్మాహుతి దళాలను ఉత్పత్తి చేస్తోంది. భారత్ అంతరిక్ష యాత్రలకు ప్రసిద్ధి చెందితే, పాకిస్తాన్ ప్రాక్సీ మిషన్లను నడుపుతోంది. భారత్ అంతరిక్షంలోకి ఉపగ్రహాలను పంపు తుంటే, పాక్ మాత్రం సరిహద్దు దాటించి ఉగ్రవాదులను పంపడంలో నిమగ్నమై ఉంది. భారతదేశం ప్రపంచానికి సాఫ్ట్‌వేర్‌ను అందిస్తుంటే, పాకిస్తాన్ ఉగ్రవాదాన్ని సరఫరా చేస్తోంది. భారతదేశం డేటా సెంటర్లను నిర్మిస్తుంటే, పాకిస్తాన్ రాడికలైజేషన్ కేంద్రాలను నిర్మిస్తోంది. భారతదేశం యూపీఐ ద్వారా ప్రపంచాన్ని అనుసంధానిస్తుంటే, పాకిస్తాన్ హవాలా ద్వారా ఉగ్రవాదాన్ని అనుసంధానిస్తోంది. మన మార్గాలు వేరు. పాకిస్తాన్ తన దుష్ట పన్నాగాలతో మన పురోగతికి ఆటంకం కలిగించడానికి ప్రయత్నిస్తే, మన ధైర్యవంతులైన సాయుధ దళాలు తగిన విధంగా సమాధానం ఇవ్వడానికి పూర్తిగా సిద్ధంగా ఉన్నాయి' అని రాజ్?నాథ్ సింగ్ అన్నారు. అంతకుముందు ఎక్స్ వేదికగా కూడా రాజ్‌నాథ్ సింగ్ కార్గిల్ అమరులకు నివాళులర్పించారు. 1999లో కార్గిల్ పర్వత శిఖరాలపై దేశ రక్షణ కోసం అసాధారణ ధైర్యసాహసాలు ప్రదర్శించి ప్రాణత్యాగం చేసిన ప్రతి సైనికుడికి దేశం ఎల్లప్పుడూ రుణపడి ఉంటుందని పేర్కొన్నారు. భారత సాయుధ దళాల అచంచల ధైర్యం, త్యాగం, దేశభక్తి భావితరాలకు దేశసేవ, విధి నిర్వహణ, మాతృభూమి కోసం సర్వస్వం అర్పించే స్ఫూర్తిని అందిస్తూనే ఉంటాయని రాజ్‌నాథ్ సింగ్ అన్నారు.

## కార్గిల్ వీరుల శౌర్యం దేశానికి స్ఫూర్తి'



కార్గిల్ విజయ్ దివస్ సందర్భంగా భారత సాయుధ దళాల వీర జవాన్లకు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నివాళులర్పించారు. దేశ భద్రత కోసం అసాధారణ ధైర్యసాహసాలు, అంకితభావంతో పోరాడిన సైనికుల పట్ల యావత్ దేశం కృతజ్ఞతాభావంతో ఉందని ప్రధాని మోదీ పేర్కొన్నారు. ఈ మేరకు ఎక్స్?లో పోస్ట్ చేస్తూ, కార్గిల్ యుద్ధ వీరుల పరాక్రమాన్ని స్మరించుకున్నారు. అత్యంత ప్రతికూల పరిస్థితుల్లోనూ భారత్ భూభాగాన్ని రక్షించేందుకు వారు కనబరిచిన శౌర్యం దేశానికి గర్వకారణంగా నిలుస్తుందని తెలిపారు. మన మాతృభూమి రక్షణ కోసం తమ ప్రాణాలను అర్పించిన ఆ వీర యోధులకు నివాళులు అర్పిస్తున్నాని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఎక్స్?లో పోస్ట్ చేశారు. వారి సాటిలేని ధైర్యసాహసాలు, అచంచలమైన సంకల్పం, దేశభక్తి భావి తరాలకు నిరంతరం స్ఫూర్తినిస్తూనే ఉంటుందని అన్నారు. వారికి ఎప్పటికీ రుణపడి ఉంటామని పేర్కొన్నారు.

**భావితరాలకు ఎల్లప్పుడూ స్ఫూర్తి : మోదీ**

"కార్గిల్ విజయ్ దివస్ సందర్భంగా భారత భద్రత కోసం అసాధారణ ధైర్యం, అంకితభావం ప్రదర్శించిన మన వీర సైనికులకు దేశం తన కృతజ్ఞతను తెలియజేస్తోంది. అత్యంత క్లిష్ట పరిస్థితుల్లో వారు కనబరిచిన పరాక్రమం ఎప్పటికీ జాతీయ గర్వానికి ప్రతీకగా నిలుస్తుంది. 1999 కార్గిల్ యుద్ధంలో ప్రాణత్యాగం చేసిన వీర జవాన్ల దేశభక్తి, విధి నిర్వహణలో వారి నిబద్ధత భావితరాలకు ఎల్లప్పుడూ స్ఫూర్తినిస్తుంది. దేశం కోసం చేసిన వారి త్యాగాన్ని భారత ప్రజలు ఎప్పటికీ మరువలేరు" అని ప్రధాని పేర్కొన్నారు.

మరోవైపు 1999 కార్గిల్ యుద్ధం తర్వాత కూడా చొరబాటుదారుల ఉద్దేశంలో ఎలాంటి మార్పు రాలేదని, ప్రాక్సీ యుద్ధం, చొరబాట్ల వంటి మార్గాల ద్వారా భారత్‌ను అస్థిరపరిచే ప్రయత్నాలు కొనసాగుతున్నాయని కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అన్నారు. అయితే అలాంటి ఎలాంటి సవాళ్లనైనా ఎదుర్కొనేందుకు భారత సైన్యం పూర్తిస్థాయిలో సిద్ధంగా ఉందని ఆయన స్పష్టం చేశారు. కార్గిల్ విజయ్ దివస్ వార్షికోత్సవం సందర్భంగా శనివారం లద్ధాఖ్‌లోని ద్రాస్ వద్ద సైనికుల కోసం ఏర్పాటు చేసిన 'శౌర్య భోజ్' కార్యక్రమంలో ప్రసంగిస్తూ ఈ మేరకు వ్యాఖ్యలు చేశారు. దేశ రక్షణ విషయంలో ప్రజలు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని రాజ్?నాథ్ అన్నారు. సాయుధ దళాల ఆధునికీకరణకు కేంద్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని తెలిపారు. సైన్యానికి అత్యాధునిక ఆయుధాలు, సాంకేతిక పరికరాలు, అత్యుత్తమ శిక్షణ అందించేందుకు ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందన్నారు. 'ఆత్మనిర్భర్ భారత్' లక్ష్యంతో రక్షణ రంగంలో స్వదేశీ ఉత్పత్తులను ప్రోత్సహిస్తున్నామని, ఈ దిశగా భారత సాయుధ దళాలు ప్రపంచంలోనే అత్యుత్తమ సైన్యంగా ఎదుగుతాయనే పూర్తి విశ్వాసం తనకు ఉందని పేర్కొన్నారు.

**'దేశభక్తే సైనికుల అసలైన బలం'**

కార్గిల్ యుద్ధంలో ప్రాణత్యాగం చేసిన సైనికుల త్యాగాలను రాజ్‌నాథ్ సింగ్ స్మరించుకున్నారు. అత్యంత ప్రతికూల వాతావరణ పరిస్థితులు, తక్కువ ఆక్సిజన్, తీవ్ర చలిని లెక్కచేయకుండా భారత భూభాగాన్ని తిరిగి స్వాధీనం చేసుకున్న వీర జవాన్ల ధైర్యసాహసాల వల్లే నేడు దేశ ప్రజలు స్వేచ్ఛగా, గర్వంగా జీవిస్తున్నారని కొనియాడారు. ద్రాస్‌లో ఉండటం తనకు ఎంతో గర్వకారణమని, అక్కడ అనుభవిస్తున్న భావోద్వేగాలను మాటల్లో చెప్పలేనని అన్నారు. భారత సైనికుల్లో ఉన్న దేశభక్తి, అంతర్గత ధైర్యసాహసాలే వారి గొప్ప బలమని పేర్కొన్నారు. ఈ విలువలు ఉన్నంతకాలం ప్రపంచంలో ఏ శక్తీ భారత్‌పై చెడు దృష్టి పెట్టే సాహసం చేయలేదని, చేయదని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు.

**ఆపరేషన్ విజయ్‌తో చారిత్రక విజయం**

1999 మే నెలలో నియంత్రణ రేఖ (ఎల్‌ఓసీ) దాటి చొరబాటుదారులు కార్గిల్ ప్రాంతంలోని ఎత్తైన శిఖరాలను ఆక్రమించారు. శ్రీనగర్-లేహ్‌ను కలిపే జాతీయ రహదారి-1ఏను దెబ్బతీయాలన్న ఉద్దేశంతో ఈ చొరబాటు జరిగినట్లు అప్పట్లో వెల్లడైంది. ఈ పరిస్థితుల్లో భారత సైన్యం 'ఆపరేషన్ విజయ్' పేరుతో ప్రతిదాడి ప్రారంభించింది. అత్యంత క్లిష్టమైన పర్వత ప్రాంతాల్లో రెండు నెలలకు పైగా సాగిన సైనిక చర్యల్లో భారత జవాన్లు అడుగడుగునా పోరాడి, ఆక్రమిత ప్రాంతాలన్నింటినీ తిరిగి స్వాధీనం చేసుకున్నారు. జులై 26, 1999న ఆపరేషన్ విజయవంతంగా ముగియడంతో ఆ రోజును ప్రతి ఏడాది కార్గిల్ విజయ్ దివస్‌గా దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్నారు.


# విద్యార్థుల డిమాండ్ న్యాయమైనదే

ఢిల్లీలో జులై 20న శాంతియుతంగా నిరసన చేపట్టిన విద్యార్థులపై జరిగిన పోలీసుల చర్యల గురించి కేంద్రంపై లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ తీవ్రంగా స్పందించారు. నిరసనకారులపై జరిగిన అమానుష దాడికి బాధ్యులెవరో వెల్లడించాలని అన్నారు. పెల్లెట్? గన్స్ వంటి ప్రాణాంతక ఆయుధాల వినియోగానికి ఎవరు అనుమతి ఇచ్చారో సమాధానం చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం అమిత్?షాకు లేఖ రాశారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో శాంతియుత నిరసన ప్రతి పౌరుడి హక్కని, అలాంటి నిరసనకారుల భద్రతను కాపాడుతూ వారి సమస్యలను చర్చల ద్వారా పరిష్కరించడం ప్రభుత్వ బాధ్యత అని రాహుల్ గాంధీ పేర్కొన్నారు.

విద్యార్థులు న్యాయమైన, జవాబుదారీతనం కలిగిన విద్యా వ్యవస్థను కోరుతూ శాంతియుతంగా నిరసన వ్యక్తం చేశారని రాహుల్ గాంధీ తెలిపారు. అయితే వారి గొంతును వినాల్సిన బదులు భద్రతా బలగాలు విచక్షణారహితంగా బలప్రయోగానికి పాల్పడ్డాయని ఆరోపించారు. టియర్‌గ్యాస్‌తో పాటు ప్రాణాంతక ఆయుధాలు కూడా ఉపయోగించారని పేర్కొన్నారు. ఈ ఘటనల్లో వందలాది మంది తీవ్రంగా గాయపడ్డారని రాహుల్ గాంధీ అన్నారు. మహిళా విద్యార్థులపై కూడా పోలీసులు దాడులకు పాల్పడ్డారని, వారిని అవమానించే విధంగా ప్రవర్తించారంటూ ఆరోపించారు.

**'పెల్లెట్ గన్స్ వినియోగమే ఆందోళనకరమైన విషయం'**

అత్యంత ఆందోళనకరమైన విషయం పెల్లెట్ గన్స్ వినియోగమేనని రాహుల్ గాంధీ పేర్కొన్నారు. మీడియా, సామాజిక మాధ్యమాల్లో వెలువడిన కథనాల ప్రకారం పలువురు తీవ్ర గాయాలపాలయ్యారని, ఒక జర్నలిస్టు కూడా గాయపడినట్లు తెలిపారు. పెల్లెట్ గన్స్ కారణంగా తీవ్రంగా గాయపడిన 19 ఏళ్ల విద్యార్థి సాహిల్ లోచబ్‌ను తాను పరామర్శించినట్లు రాహుల్ గాంధీ లేఖలో పేర్కొన్నారు.



ప్రస్తుతం అతడు తీవ్రమైన నొప్పితో బాధపడుతున్నాడని, ఒక కన్ను కోల్పోయే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు.

**అమిత్ షాకు రాహుల్ ప్రశ్నలు**

ఢిల్లీలో విధులు నిర్వహించే భద్రతా బలగాలు చివరికి కేంద్ర హోంమంత్రిత్వ శాఖ పరిధిలోనే పనిచేస్తాయని గుర్తుచేసిన రాహుల్ గాంధీ, ఈ ఘటనపై అమిత్ షాకు పలు ప్రశ్నలు సంధించారు. విద్యార్థులపై పెల్లెట్ గన్స్ సహా ప్రాణాంతక బలప్రయోగానికి మీరు అనుమతి ఇచ్చారా? ఒకవేళ ఇవ్వకపోతే ఆదేశాలు జారీ చేసింది ఎవరు? సాధారణ దుస్తుల్లో కనిపిస్తూ లాఠీలతో విద్యార్థులపై దాడి చేసిన వ్యక్తులు పోలీసులు లేదా స్వచ్ఛంద కార్యకర్తలా? వారిని అక్కడ మోహరించేందుకు అనుమతి ఇచ్చింది ఎవరు? ఈ ప్రశ్నలకు కేంద్ర ప్రభుత్వం సమాధానం చెప్పాలని రాహుల్ గాంధీ డిమాండ్ చేశారు.

**'ప్రజాస్వామ్యంలో నిరసనలు కీలకం'**

శాంతియుత నిరసనలు ప్రజాస్వామ్య వ్యవస్థలో అత్యంత కీలకమైనవని రాహుల్ గాంధీ పేర్కొన్నారు. నిరసనకారులపై ఇలాంటి హింసాత్మక చర్యలు ప్రజాస్వామ్య విలువలను దెబ్బతీస్తాయని అన్నారు. దేశ భవిష్యత్తైన యువత సమాధానాలు, జవాబుదారీతనం కోరుతోందని, వారి గొంతును ఎవరూ అణిచివేయలేరని లేఖలో పేర్కొన్నారు. విద్యార్థులపై జరిగినట్లు ఆరోపణలు వస్తున్న బలప్రయోగానికి కారణమైన వారిపై విచారణ జరిపి, బాధ్యులను చట్టపరంగా శిక్షించాలని రాహుల్ గాంధీ డిమాండ్ చేస్తున్నారు. శనివారం మీడియాతో మాట్లాడుతూ, విద్యార్థులపై జరిగిన పరిణామాలకు కేంద్ర ప్రభుత్వమే బాధ్యత వహించాలని అన్నారు. ఈ మొత్తం వ్యవస్థకు నాయకత్వం వహిస్తున్న ప్రధానమంత్రి నరేంద్ర మోదీ విద్యార్థులకు, దేశ భవిష్యత్తుకు క్షమాపణ చెప్పాలని కోరారు.


నీట్-యూజీ ప్రశ్నపత్రం లీక్ వ్యవహారంపై బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ ప్రారంభమైన ఈ ఉద్యమానికి 'కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ)' నాయకత్వం వహించింది. జూన్ 20న జంతర్‌మంతర్‌లో ప్రారంభమైన నిరసనలు, జూన్ 28న సామాజిక కార్యకర్త సోనమ్ వాంగ్‌చుక్ నిరవధిక నిరాహార దీక్ష ప్రారంభించిన తర్వాత దేశవ్యాప్తంగా విస్తరించాయి. జులై 20న పార్లమెంట్ వైపు నిరసన ర్యాలీగా వెళ్తున్న ఆందోళనకారులపై పోలీసులు చేపట్టిన చర్యల తర్వాత ఈ ఉద్యమానికి మరింత మద్దతు లభించింది. అనంతరం ప్రభుత్వం సీజేపీ ప్రతినిధులతో చర్చలు జరిపి వారి డిమాండ్లను అంగీకరించింది.

## సంపాదకీయం

# దుర్భిక్ష పర్వం

ఈ ఏడాది వానలు ముఖం చాటేస్తున్నాయి. రైతుల కళ్లల్లో దిగులు మబ్బులు కనిపిస్తున్నాయే గాని, ఎక్కడా చినుకుల సవ్వడి వినిపించడం లేదు. సకాలంలో సమృద్ధిగా వర్షాలు కురవకుంటే, చాలినన్ని తిండి గింజలు పండక కరవు కాటకాలు తప్పవు. అనావృష్టి తెచ్చిపెట్టే కరవు కాటకాలు సామాన్యుల బతుకులను దుర్భరం చేస్తాయి. ప్రధానంగా మనది వ్యవసాయాధారిత దేశం. వ్యవసాయాన్నే నమ్ముకుని, దేశానికి వెన్నెముకగా నిలుస్తున్న కర్షక జనాభా వర్షాభావం వల్ల కష్టాల్లో పడితే, యావత్ దేశానికే కష్టాలు తప్పవు. వర్షాల కోసం క్రమం తప్పక యజ్ఞయాగాదులు చేసే సంస్కృతి మనది. వర్ష ప్రాధాన్యం పట్ల ఎరుక కలిగిన జాతి మనది. 'అనావృష్టి మతీత్యైవ మహతీ వర్షసంతతిః/ భూతానాం సంక్షయం చక్రే దుర్భిక్ష పరిపీడితమ్' అని విష్ణుపురాణం చెబుతోంది. అనావృష్టి వల్ల పంటలు పండక దుర్భిక్షంతో మనుషులే కాదు, సమస్త ప్రాణులూ సంక్షోభానికి, నాశనానికి లోనవుతాయి. కరవు కాటకాలు మన దేశానికి కొత్త కాదు. వానలు లేక, నేల నెర్రెలు పడిన దుర్భర దుర్భిక్ష వర్ణనలు మన పురాణ సాహిత్యం మొదలుకొని ఆధునిక సాహిత్యం వరకు చాలానే ఉన్నాయి. 'అదే పెన్న! అదే పెన్న!/ నిదానించి నడు/ విదారించు నెదన్, వట్టి/ ఎడారి తమ్ముడు!' అంటూ 'పెన్నేటి పాట' రాసిన విద్వాన్ విశ్వం ఒకనాటి రాయలసీమ కరవు దృశ్యాన్ని హృదయ విదారకంగా చిత్రించారు. కరవు కాటకాలను ముందుగా తెలుసుకునే సాంకేతికత ఇదివరకు ఉండేది కాదు. అందువల్ల దుర్భిక్షాన్ని దైవఘటనగానే పరిగణించేవారు. ఇటీవలి కాలంలో సాంకేతిక పెరిగింది. అతివృష్టి, అనావృష్టి పరిస్థితు లను; అల్పపీడనాలు, వాయుగుండాలు, తుఫానుల వంటి ప్రకృతి విపత్తులను ముందు గానే గ్రహించి, వాతావరణ శాస్త్రవేత్తలు హెచ్చరికలు చేయగలుగుతున్నారు. పాలకులు బాధ్యతనెరిగిన వారైతే, వాతావరణ శాస్త్రవేత్తల హెచ్చరికలను పట్టించుకుని కార్యాచరణను ప్రారంభిస్తారు. పాలకులు బాధ్యతను మరచి, హాలికులను వారి కర్మానికి వారిని విడిచిపెడితే, దుర్భిక్ష పర్యవసానాలు మరింత దుర్భరంగా ఉంటాయి. ఈసారి 'సూపర్ ఎల్ నినో' పరిస్థితులు ఏర్పడనున్నట్లు వాతావరణ శాస్త్రవేత్తలు వేసవిలోనే హెచ్చరికలు చేశారు. ఈ హెచ్చరికలు ఒకవైపు రైతులలో గుబులు పెంచుతుంటే, మరోవైపు చీకటి వ్యాపారులలో, రాజకీయ దళారులలో, అవినీతిలో మునిగితేలే అధికార గణాల్లో సంబరాన్ని పెంచుతున్నాయి. కరవును కూడా సొమ్ముచేసుకోగల సమర్థులు మనకు కొత్త కాదు. ఇలాంటి దౌర్భాగ్యాన్ని గురించే పాత్రికేయుడు సాయినాథ్ 'ఎవ్రీబడీ లవ్స్ ఎ గుడ్ డ్రౌట్' పుస్తకాన్ని ముప్పయ్యేళ్ల కిందటే రాశారు. 'కృషితో నాస్తి దుర్భిక్షం' అని నేలను నమ్ముకున్న రైతు కలలోనైనా కరవు కాటకాలను కోరుకోడు. రోజువారీ పనులు చేసుకుంటూ అన్నం తిని బతికే సామాన్య ప్రజలు కూడా కరవు కాటకాలను కోరుకోరు. ప్రతి సంక్షోభాన్నీ స్వీయ సంక్షేమ అవకాశంగా మార్చుకొనే దౌర్భాగ్యులే దుర్భిక్షాన్ని కోరుకుంటారు. 'వార్ధుషికః వణిగ్బంధుః యే చ ప్రభూతమన్న సంగ్రహం/ కృత్వా దుర్భిక్షం వాంఛంతి తే పి వార్ధుషికా' అని ప్రాచీన సుభాషిత శ్లోకం చెబుతుంది. వర్తకులకు అధిక వడ్డీలకు అప్పులిచ్చి, జనాలను పీడించే వడ్డీ వ్యాపారులు దేశంలో కరవు కాటకాలు రావాలని కోరుకుంటారని ఈ శ్లోక సారాంశం. ఇప్పటి కాలంలో వడ్డీ వ్యాపారులకు జతగా కార్పొరేట్ ఫైనాన్స్ కంపెనీల నిర్వాహకులు, రాజకీయ దళారులు, లంచగొండి అధికారులు కూడా జనాలకు దాపురించారు. వీళ్లందరూ కరవులో అధికమాసం లాంటివారు. ఈ ఏడాది 'సూపర్ ఎల్ నినో' కారణంగా భారత్ సహా ఎనభై ఎనిమిది దేశాలు తీవ్ర వర్షాభావంతో అల్లాడనున్నాయి. ఇది కేవలం ప్రకృతి పరిణామం మాత్రమే కాదు, ఇంగితం లేని పాలకుల చర్యలకు పర్యవసానం కూడా! భూతాపం పెరుగుదలపై పర్యావరణవేత్తలు మొత్తుకుంటూనే ఉన్నా, కొందరు దేశ్యాధినేతలు యుద్ధ విధ్వంసాల్లో మునిగితేలుతున్నారు. ఇంకొందరు అభివృద్ధి పేరుతో అడవుల నరికివేతకు ఊత మిస్తున్నారు. ఈకాలం దుర్భిక్షం బాధ్యతెరుగని పాలకుల స్వార్థఫలం.

# ఆందోళనల వెనుకున్నది అధికార దాహమే!



వర్షాకాల పార్లమెంట్ సమావేశాలు ప్రారంభమవుతున్నాయని ప్రభుత్వం నుంచి ప్రకటన రాగానే నిద్రాణమై ఉన్న భారత వ్యతిరేక అదృశ్య శక్తులు ఒక్కసారిగా మేల్కొన్నాయి. ఇప్పుడు ఢిల్లీలో నెలకొన్న పరిస్థితులు, వాటి వెనకున్న కారణాలను అన్వేషిస్తే విస్తుపోయే వాస్తవాలు బయటపడుతున్నాయి. ప్రభుత్వం పట్ల వ్యతిరేకతలు, భిన్నాభిప్రాయాలు కలిగి ఉండటం సహజం. భారతదేశం వంటి ఆదర్శ ప్రజాస్వామ్య రాజ్యంలో గతంలో ఎన్నో ఆందోళనలు జరిగాయి కానీ, ఇంత విద్వేషపూరితమైన, అసాధారణమైన పరిస్థితులు చూడటం బహుశా ఇదే మొదటిసారికావచ్చు. ఇవన్నీ చూస్తుంటే దేశంలో జరుగుతున్న అసహన రాజకీయాలు రూపుమార్చుకొని, అంతమొందించే రాజకీయాలుగా రూపాంతరం చెందాయన్న విషయం తెలుస్తోంది.

పక్కా ప్రణాళిక ప్రకారం విచ్ఛిన్నకర శక్తులు దేశంలో అలజడి సృష్టించడానికి ఎదురుచూస్తుండగా వచ్చిన ఈ అవకాశాన్ని దృష్టిలో పెట్టుకొని, అవి తమ దుశ్చర్యలకు రూపం కల్పించినట్టుగా ఈ ఆందోళన కనిపిస్తోంది. ఎన్నో ఏళ్లుగా అధికారం కోసం అర్రులు చాస్తూ వస్తున్న అవకాశవాద రాజకీయ నాయకులు తమ నిజస్వరూపాన్ని, ఈ దేశం పట్ల వారికున్న దురుద్దేశాన్ని, దేశ ప్రజల సంక్షేమం పట్ల వారికున్న నిర్లక్ష్య భావాన్ని నేడు బట్టబయలు చేస్తున్నారు.

ఇరవై ఆరు రోజులుగా నిరాహార దీక్ష చేసిన వాంగ్‌చుక్ గత చరిత్ర కూడా దేశ వ్యతిరేక కార్యకలాపాలతోనే ముడిపడి ఉంది. చైనాకు మద్దతుగా, పీఓకేను ప్రజాభిప్రాయ సేకరణ ద్వారా పాకిస్థాన్‌లో కలపాలని వాదించిన వ్యక్తి. పర్యావరణ కార్యకర్తగా, విద్యావేత్తగా గుర్తింపు పొందిన వాంగ్‌చుక్ చేసినవన్నీ దేశ వ్యతిరేక కార్యకలాపాలే.

నిజంగా ఇది నీట్ కోసం జరిగిన ఉద్యమమే అయితే, అక్కడ నీట్ విద్యార్థులు కానీ, కనీసం వారి తల్లిదండ్రులు కానీ కనిపించలేదు. ఇప్పటివరకూ దేశంలో వందల పేపర్ లీకేజీలు జరిగాయి. అది వ్యవస్థలోని లోపాలను ప్రతిసారీ ఎత్తిచూపుతూనే ఉంది. అదీగాక, రీ--ఎగ్జామ్ జరిగి ఫలితాలు వచ్చిన తర్వాత, నిందితులను గుర్తించి అరెస్టు చేసిన తర్వాత కూడా ఆందోళనలు కొనసాగడం వెనుక వారి ఉద్దేశం ఏమిటి? అధికార దాహంతో వ్యవహరిస్తున్న శక్తులు తమ దుష్ట ఉద్దేశాలను అమలు చేయడానికి యువత బలహీనతలను అవకాశంగా మార్చుకుంటున్నాయి. శ్రీలంక, నేపాల్, బంగ్లాదేశ్‌లో వలే ఇక్కడ కూడా అశాంతి సృష్టించేలా దేశద్రోహ కార్యక్రమాలు చేపట్టి, ప్రభుత్వంపై తిరుగుబాటు జరుగుతున్నట్లు చిత్రీకరించాలనే వారి కుట్ర బయటపడుతోంది. కాక్రోచ్ పార్టీ నాయకులు కొంతకాలం క్రితం జంతర్ మంతర్ వద్ద చేసిన వ్యాఖ్యలు కూడా ఇదే విషయాన్ని బహిర్గతం చేశాయి.

అంతేకాకుండా, ఆందోళనల సమయంలో మహిళల పట్ల అనుచిత ప్రవర్తన, అసభ్య వ్యాఖ్యలు చేయడం, మహిళా జర్నలిస్టులను దుర్భాషలాడడం వంటి ఘటనలు ఏ ఉద్యమానికీ సమర్థనీయమైనవి కావు. ఇంటర్నెట్‌ను నిలిపివేసిన పరిస్థితుల్లో కూడా మెసేజింగ్ యాప్‌ల ద్వారా ఆందోళనలకు రూపకల్పన చేయడం, నిఘా వర్గాలకు చిక్కకుండా హింసాత్మక చర్యలను నిర్వహించడం వంటి అంశాలను కూడా గమనించాల్సిన అవసరం ఉంది. ఇది ప్రేరేపిత ఉద్యమం కాకపోతే కేవలం జంతర్ మంతర్ వద్ద ఆందోళనలకు వచ్చినవారు.. భద్రతా దళాల కన్నుగప్పి ప్రధాని నివాసంపై దాడికి యత్నించడం, ఒక్కసారిగా ప్రతిపక్ష నాయకులు ప్రధాని నివాసానికి చేరుకుని ఆందోళన చేయటం రాజకీయ కుట్ర కాక మరేమిటి? అంతకు మూడు రోజుల ముందు అమెరికా వంటి దేశం తన పౌరులకు అడ్వైజరీ జారీ చేయడం గమనించాల్సిన విషయం. ఆందోళనకారులకు అవసరమైన నిధులు ఎక్కడి నుంచి వస్తున్నాయి? అనే విషయాన్ని కూడా కేంద్ర నిఘా సంస్థలు పరిశీలిస్తున్నాయి.

ప్రపంచంలోని కొన్ని దేశాలు తమ ఆధిపత్యాన్ని కొనసాగించడానికి భారత్‌ను లక్ష్యంగా చేసుకుంటున్నాయి. భారతదేశాన్ని అంతర్జాతీయంగా అస్థిరంగా చూపించాలనే ప్రయత్నాలు జరుగుతున్నాయి. అలాగే, దేశంలో రాజకీయంగా బలపడలేని, ప్రజా మద్దతు లేని నాయకులు, 'అసహనం' పేరుతో గతంలో ఉద్యమాలు చేసినవారు, ఆపరేషన్ కగార్ ఆపి నక్సల్స్‌ను కాపాడాలని చర్చలు జరపాలన్నవారు, అవార్డులు వాపస్ ఇచ్చిన ప్రముఖులను ఇప్పుడు తమ డిమాండ్లకు మద్దతుగా నిలబెట్టే ప్రయత్నం చేయడం రాజకీయ అసహనం కాక మరేమిటి? అలాంటి రాజకీయ పార్టీలు నేటి ఆందోళనకారులకు తోడవడం వారి ఉద్దేశాలను బట్టబయలు చేసింది. అక్కడకు వచ్చిన యువత సహజంగా వచ్చినవారు కాదు; వివిధ రాజకీయ పార్టీలు పంపిన పెయిడ్ బ్యాచ్‌లుగా కనిపించారు. అక్కడ ఉన్న మీడియా ప్రతినిధులపై కూడా దాడులు చేశారు. పోలీసులపై, సాయుధ బలగాలపై చెలరేగి, వారిని రెచ్చగొట్టి లాఠీచార్జికి ప్రేరేపించే ప్రయత్నం జరిగింది. గతంలో హైదరాబాద్‌లో జరిగిన రోహిత్ వేముల ఆత్మహత్య ఘటనను జాతీయ సమస్యగా చిత్రీకరించినట్లుగానే, ఇక్కడ కూడా ప్రతిపక్ష పార్టీలు అన్నీ ఒక్కటై ఆ మంటల్లో చలి కాచుకునే ప్రయత్నం చేశాయి. ఇప్పటికీ తెలంగాణలో నక్సల్ సానుభూతిపరులకు, అర్బన్ నక్సల్స్‌కు ప్రభుత్వం ప్రత్యక్షంగా ఆశ్రయం ఇస్తూ, సమయం వచ్చినప్పుడు వారిని రాజకీయ దాడులకు వాడుకుంటోంది. విదేశాల్లో పుట్టిన కాక్రోచ్ పార్టీ... ప్రతిపక్షాలతో చేరి, తమకున్న అంతర్జాతీయ నెట్‌వర్క్‌ను ఉపయోగించుకుంటూ, మోదీ ప్రభుత్వాన్ని కూల్చడమే లక్ష్యంగా ముందుకు సాగుతోంది. కేంద్ర మంత్రులు పార్లమెంట్ వేదికగా చర్చకు అంగీకరించారు. కానీ, చర్చలో పాల్గొనకుండా తమ విధ్వంసక చర్యలను కొనసాగించడానికి మొగ్గు చూపిన కాక్రోచ్ పార్టీ అంతరంగం అర్థమవుతోంది. ప్రధాని మోదీ ఈ పేపర్ లీకేజీ విషయాన్ని సీరియస్‌గా తీసుకొని, ఇప్పటికే సంబంధిత మంత్రులతో చర్చించారు. ఈ విషయంలో కఠినంగా వ్యవహరిస్తామని, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూస్తామని చెప్పారు. పేపర్ లీకేజీల విషయంలో ఫాస్ట్ ట్రాక్ కోర్టుల ద్వారా విచారణ జరిపించి, వేగంగా శిక్షలు పడేలా చర్యలు తీసుకుంటామని కూడా ప్రకటించారు.

బలహీనమైన దేశాలైన శ్రీలంక, బంగ్లాదేశ్, నేపాల్లో జరిగిన హింసాత్మక పరిణామాలను భారతదేశంలో కూడా పునరావృతం చేయాలనే కుట్రలు ఎప్పటికీ విజయవంతం కావు. చైతన్యవంతమైన భారత యువత ఇవన్నీ గమనిస్తూనే ఉంది. గోరంతను కొండంతగా చూపిస్తూ యువతను, విద్యార్థులను రెచ్చగొట్టే రాజకీయాలను దేశం సహించదు. సమయం వచ్చినప్పుడు ఈ దేశ యువత ప్రతిపక్షాలకు తప్పక సమాధానం ఇస్తుంది.

# ఈ కుట్ర సిద్ధాంతాలకు కాలం చెల్లింది!

ఢిల్లీ అధికార కారిడార్లలో కుట్ర సిద్ధాంతాలు నిరంతరం వినిపిస్తూనే ఉంటాయి. నేటి రాజకీయ భారతంలో అవి గుసగుసల కంటే బిగ్గరగా వినిపిస్తున్నాయి. ఇప్పుడు అవి రాజకీయ ఆయుధాలుగా పరిణమించాయి. దేశ రాజధానిని కుదిపేసిన విద్యార్థుల నిరసనలతో సంబంధమున్న సోనమ్ వాంగ్‌చుక్, కాక్రోచ్ జనతా పార్టీ(సీజేపీ) సభ్యులు తాజా కుట్ర సిద్ధాంతాలకు లక్ష్యాలుగా ఉన్నారు. ప్రశ్నపత్రాల లీక్‌లు, తగ్గిపోతున్న ఉద్యోగావకాశాలు, నియామకాల్లో జాప్యాలపై లక్షలాది యువ భారతీయులు ఎందుకంతగా ఆగ్రహావేశాలు వ్యక్తం చేస్తున్నారో అర్థం చేసుకోకుండా, వారి ఆందోళనలకు నాయకత్వం వహిస్తున్నవారి ఉద్దేశాలను ప్రశ్నించేందుకే రాజకీయ పార్టీలు ప్రాధాన్యమిస్తున్నాయి.

వాంగ్‌చుక్, సీజేపీలు మోదీ ప్రభుత్వ 'రహస్య రాజ్య వ్యవస్థ' (డీప్ స్టేట్)లో భాగమే అని కాంగ్రెస్ శ్రేణుల్లో బాగా ప్రచారంలో ఉన్న ఒక సిద్ధాంతం చెబుతోంది. 'నీట్' పరీక్షల గందరగోళంపై ప్రజ్వరిల్లిన ఆందోళనల నుంచి రాజకీయలబ్ధి పొందకుండా కాంగ్రెస్‌ను నివారించేందుకే వాంగ్‌చుక్, సీజేపీని మోదీ సర్కార్ 'డీప్ స్టేట్' రంగంలోకి దించిందనేది ఆ సిద్ధాంత సారాంశం. ఇదొక అసాధారణ వాదన. దీనికి సాక్ష్యాధారాలు ఏవీ లేవు. అయితే వాస్తవాల కంటే అనుమానాలే మహా వేగంగా విస్తరిల్లి, వర్ధిల్లే వర్తమాన యుగంలో కుట్ర సిద్ధాంతాల శీఘ్రగతిన బాగా ప్రభావదాయక మవుతున్నాయి. లద్దాఖ్‌కు మరింత స్వతంత్ర ప్రతిపత్తి నివ్వాలని డిమాండ్ చేస్తూ ఆ హిమాలయ ప్రాంతవాసులు ఏడాది క్రితం నిర్వహించిన ఆందోళనలో హింసాత్మక ఘటనలు సంభవించాయి. వాటికి సోనమ్ వాంగ్‌చుక్ బాధ్యుడు అనే ఆరోపణతో ఆయనను జాతీయ భద్రతా చట్టం కింద అరెస్ట్ చేశారు. ఆరు నెలలపాటు జైలు నిర్బంధంలో ఉన్న తరువాత విడుదల చేశారు. అరెస్ట్ చేయడానికి కారణాలు ఏమిటో ప్రభుత్వం చెప్పనే లేదు. వాంగ్‌చుక్ జైలులో ఉన్న సమయంలో బీజేపీ సామాజిక మాధ్యమాలలో ఆయనను విదేశీ నిధులు పొందుతున్న 'జాతి వ్యతిరేకి'గా చిత్రించారు. 'చైనా ఏజెంట్' అని కూడా ఆరోపించారు. తమ రాజకీయ కథనాలను సమర్థించుకోవడానికై వాంగ్‌చుక్ ఉపన్యాసాల నుంచి ఎంపిక చేసిన మాటలను ఉల్లేఖించారు.

ఇప్పుడు అదే వ్యక్తిని ఇంటెలిజెన్స్ బ్యూరో చేతుల్లో కీలుబొమ్మ అని కాంగ్రెస్ శ్రేణులు నిందిస్తున్నాయి. మోదీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా కాంగ్రెస్ చేస్తున్న పోరాటం, రాహుల్‌గాంధీ నుంచి ప్రజల దృష్టిని మళ్లించేందుకు వాంగ్‌చుక్‌ను ఉపయోగించుకుంటున్నారని ప్రధాన ప్రతిపక్షం ఆరోపిస్తోంది. 'చైనా ఏజెంట్'గా ఆరోపణలకు గురైన వ్యక్తి భారత ప్రభుత్వ ఏజెంట్‌గా ఎలా పరిణమించాడు? తమ నీడను చూసి జడుసుకునే రాజకీయవాదుల భయానుమానాలలోని అసంబద్ధతను వాంగ్‌చుక్‌పై ఈ నిందలు బహిర్గతం చేస్తున్నాయి.

వాంగ్‌చుక్ నాకు రెండు దశాబ్దాలుగా తెలుసు. విద్యారంగం, పర్యావరణ పరిరక్షణలో ప్రశస్త కృషికి గాను 2008లో సీఎన్ఎన్--ఐబీఎన్ వార్తా సంస్థ వాంగ్‌చుక్‌ను 'రియల్ హీరో'గా గౌరవించి సత్కరించిన సందర్భంలో నేను ఆయనను మొదటిసారి కలుసుకున్నాను. ఆనాటి సభలో నటుడు ఆమిర్‌ఖాన్ కూడా ఉన్నారు. ఆ తరువాత ఆయన నటించిన 'త్రీ ఇడియట్స్' సినిమా వాంగ్‌చుక్ జీవితం నుంచి స్ఫూర్తి పొందినట్టుగా ప్రచారం జరిగింది. విద్యారంగంలో మౌలిక మార్పులకు, సుస్థిరాభివృద్ధి లక్ష్యాల పరిపూర్తికి, లద్దాఖ్ భవిష్యత్తుకు వాంగ్‌చుక్ చేస్తున్న కృషిని నేను చాలా సంవత్సరాలుగా గమనిస్తూ వస్తున్నాను. వాంగ్‌చుక్ ప్రతిష్ఠాత్మక రామన్ మెగసెసే అవార్డు గ్రహీత. గతంలో అన్ని రాజకీయ పార్టీలు సమున్నతంగా గౌరవించిన వ్యక్తి, ఇప్పుడు ఎవరు మాట్లాడుతున్నారు అన్నదానిపై ఆధారపడి ఆయన దేశద్రోహిగానో లేక ప్రభుత్వ ఏజెంట్‌గానో ఎలా అయ్యారు? మోదీ ప్రభుత్వం సైతం ఆయనను పలుమార్లు బహిరంగంగా ప్రశంసించింది. మార్చి 2023లో వాంగ్‌చుక్, ఆయన సతీమణితో సమావేశమైన తరువాత వారితో తాను దిగిన ఫొటో నొకదాన్ని ధర్మేంద్ర ప్రధాన్ 'ఎక్స్'లో పోస్ట్ చేశారు, వివిధ రంగాలలో ఆ దంపతులు చేస్తున్న కృషిని ఆయన ప్రశంసించారు. మూడు సంవత్సరాల తరువాత నీట్ వివాదంలో ప్రభుత్వాన్ని నిలదీసినందుకుగాను వాంగ్‌చుక్‌పై బీజేపీ నాయకుల గౌరవాభిమానాలు పూర్తిగా తుడిచిపెట్టుకు పోయాయి. వాంగ్‌చుక్ లేవనెత్తిన ప్రశ్నలపై చర్చించడానికి బదులుగా ఆయన ఉద్దేశాలను అనుమానిస్తున్నారు. మరొక ఉదంతాన్ని కూడా ప్రస్తావించవలసి ఉన్నది. 'లేహ్ అటానమస్ డెవలెప్‌మెంట్ కౌన్సిల్' వాంగ్‌చుక్ ఆధ్వర్యంలోని హిమాలయన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఆల్టర్‌నేటివ్స్'కు 1000 కనాల్స్ (8 కనాల్‌లు ఒక ఎకరానికి సమానం) భూమిని కౌలుకు ఇచ్చింది. ఆ తరువాత ఆ కౌలును రద్దు చేసింది. లద్దాఖ్ స్వతంత్ర ప్రతిపత్తి ఉద్యమంలో వాంగ్‌చుక్ కీలకపాత్ర వహిస్తున్న కారణంగానే ఈ రద్దు జరిగిందన్నది స్పష్టం. భిన్నాభిప్రాయ వ్యక్తీకరణను ప్రజాస్వామిక స్వేచ్ఛగా కాకుండా ఒక విరోధ చర్యగా పరిగణించడం వల్లే ఇలా జరిగింది. ప్రభుత్వ నిర్ణయాలతో విభేదించినవారు బెదిరింపులు, వ్యక్తిత్వ హననాలకు గురవుతున్నారు. మోదీ ప్రభుత్వం మొదటి నుంచీ ఇలానే వ్యవహరిస్తోంది. పాత్రికేయులు, విద్యావేత్తలు, పౌర సమాజ కార్యకర్తలు అందరూ ఈ ప్రభుత్వ ఆగ్రహానికి గురవుతూనే ఉన్నారు.

కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ)ని మోదీ సర్కార్ తొలుత నెలలపాటు పూర్తిగా ఉపేక్షించింది. సీజేపీ కార్యకర్తల నిరసన ఉధృతమైన తరువాతనే దాని ఉనికిని అంగీకరించడం సర్కార్‌కు అనివార్యమయింది. కాంగ్రెస్ పార్టీ విషయానికి వస్తే, సీజేపీ అనేది ఆమ్ ఆద్మీ పార్టీకి ఒక పరోక్ష ప్రతినిధి మాత్రమే. కారణం దాని స్థాపకుడు అభిజిత్ దీప్కే గతంలో ఆప్ సోషల్ మీడియాలో పనిచేయడమే! 2011లో అన్నాహజారే ఉద్యమం నుంచే ఆమ్‌ఆద్మీ పార్టీ ప్రభవించి, యూపీఏ ప్రభుత్వ పతనాన్ని వేగవంతం చేసిన చరిత్ర కాంగ్రెస్‌ను ఇప్పటికీ బాధిస్తూనే ఉన్నది. అయితే చరిత్ర ఒక బందీఖానా కాకూడదన్న వివేకాన్ని చూపకపోతే ఎలా?

సీజేపీ కార్యకర్తలు పలువురితో నేను సంభాషించాను. పార్టీ రాజకీయాలు కాకుండా వ్యవస్థ పట్ల అసంతృప్తే వారి తిరుగుబాటుకు ప్రేరణ. ఈ 'జనతా' వాదులు అనుభవ శూన్యులు, అయితే.. ఆదర్శవాదులు. అప్పుడప్పుడు అవ్యవస్థితులు, అయితే.. కపటరహిత రాజకీయులు. తాము ఎందుకు ఈ ఆందోళనకు పూనుకున్నామని వారు నిర్మొహమాటంగా చెబుతున్నదాన్ని వినడం కంటే-- ఏదో ఒక రాజకీయ పార్టీ ఏజెంట్లు అని కొట్టివేయడం చాలా తేలిక. అసలు ఈ నిర్లక్ష్య వైఖరే ఒక పెద్ద విషాదం. పన్నెండు సంవత్సరాలుగా అధికారంలో ఉన్న మోదీ ప్రభుత్వం భిన్నాభిప్రాయాల వ్యక్తీకరణను సహించలేకపోతోంది. అసమ్మతిని పరిగణనలోకి తీసుకోవల్సిన అవసరం లేదని లేదా దానిని అణచివేయవచ్చని విశ్వసిస్తోంది. విమర్శకులను విరోధులుగా, నిరసనకారులను కుట్రదారులుగా చూస్తోంది. ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికైన ప్రధానమంత్రిని బలహీనపరిచేందుకు విదేశీ శక్తులతో కుమ్మక్కయినవారు చేస్తోన్న మరో ప్రయత్నమే సీజేపీ అని ప్రభుత్వం భావిస్తోంది. తమ సమస్యల పరిష్కారానికి ఆందోళన చేస్తున్న యువతపై రాజకీయ నిందారోపణలు చేయడం రాజకీయపక్షాలకు తగదు. కుట్రసిద్ధాంతాలలో పావులుగా వారిని పరిగణించకూడదు. అంతకంటే మెరుగైన విషయాలకు యువ భారతీయులు అర్హులు. ప్రశ్నపత్రాల లీక్‌కు కారణాలు ఏమిటో వారికి స్పష్టంగా వివరించాలి. ఉద్యోగ నియామకాల్లో జాప్యం ఎందుకు జరుగుతుందో చెప్పాలి. క్షీణిస్తున్న విద్యా ప్రమాణాలను ఎలా మెరుగుపరచనున్నారో స్పష్టంచేయాలి. తగ్గిపోతున్న ఉద్యోగావకాశాల విషయమై సంజాయిషీ చెప్పాలి. తమ ఆకాంక్షలను వినే ప్రభుత్వాలు, తమకు నాయకత్వం వహించే ప్రతిపక్షాలు యువభారతీయులకు అవసరం.

# కుర్రాడు అదరగొట్టాడు

## జింబాబ్వేతో టీ20 సిరీస్‌ను క్లీన్‌స్వీప్ చేసిన భారత్

## వైభవ్ విలువైన ఇన్నింగ్స్



అనూహ్యమేమీ జరగలేదు. జోరు కొనసాగించిన టీమ్‌ఇండియా జింబాబ్వేతో పొట్టి సిరీస్‌ను 3-0తో ఊడ్చేసింది. ఆల్‌రౌండ్ ఆధిపత్యాన్ని ప్రదర్శించిన శ్రేయస్ బృందం.. ఆఖరి మ్యాచ్‌లోనూ ఘనవిజయాన్నందుకుంది. కాస్త సంయమనంతో కూడిన విధ్వంసం సృష్టించిన యువ సంచలనం వైభవ్ సూర్యవంశీ.. కెరీర్‌లో తొలిసారి 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' అవార్డును సొంతం చేసుకున్నాడు. 'ప్లేయర్ ఆఫ్ ద సిరీస్' కూడా అతడే.

జింబాబ్వే పర్యటనను టీమ్‌ఇండియా ఘనంగా ముగించింది. ఆదివారం ఏకపక్షంగా సాగిన మూడో టీ20లో 35 పరుగుల తేడాతో జింబాబ్వేను చిత్తు చేసింది. వైభవ్ సూర్యవంశీ (81; 49 బంతుల్లో 8ఐ4, 4ఐ6) మెరవడంతో మొదట భారత్.. 5 వికెట్ల నష్టానికి 192 పరుగులు చేసింది. ఛేదనలో జింబాబ్వే తడబడింది. మయాంక్ యాదవ్ (3/29), యశ్ ఠాకూర్ (2/45) ధాటికి 7 వికెట్లకు 157 పరుగులే చేయగలిగింది. ర్యాన్ బర్ల్ (54 నాటౌట్; 43 బంతుల్లో 5ఐ4) టాప్ స్కోరర్. అశోక్ శర్మ (1/20), రవి బిష్ణోయ్ (1/24) కట్టుదిట్టమైన బౌలింగ్‌తో ఆతిథ్య జట్టుకు కళ్లెం వేశారు.

**జింబాబ్వే తడబాటు:** ఛేదనలో జింబాబ్వే తేలిపోయింది. క్రమం తప్పకుండా వికెట్లు చేజార్చుకున్న ఆ జట్టు.. ఏ దశలోనూ పోటీలో లేదు. మయాంక్ యాదవ్ మరోసారి సూపర్‌గా బౌలింగ్ చేశాడు. తొలి బంతికే బెనెట్‌ను ఔట్ చేసి భారత్‌కు శుభారంభాన్నిచ్చాడు. నాలుగో ఓవర్లో మయర్స్ (19), సికందర్ రజా (0)లను వెనక్కి పంపడం ద్వారా జింబాబ్వేను యశ్ ఠాకూర్ గట్టి దెబ్బతీశాడు. బెన్ కరన్ (20), బర్ల్ ఆ జట్టును ఆదుకునే ప్రయత్నం చేశారు. కానీ అది ఏమాత్రం సరిపోలేదు. 8వ ఓవర్లో కరన్‌ను బిష్ణోయ్ వెనక్కి పంపడంతో 65/4తో జింబాబ్వే చిక్కుల్లో పడింది.

ఆ తర్వాత బర్ల్, మద్వీర అయిదో వికెట్‌కు 60 పరుగులు జోడించినప్పటికీ.. వేగంగా ఆడలేకపోవడం, సాధించాల్సిన రన్‌రేట్ పెరుగుతూ పోవడంతో ఆ జట్టు ఎప్పుడూ గెలుపు రేసులో లేదు. 16వ ఓవర్లో మద్వీర (28) నిష్క్రమించేటప్పటికి జింబాబ్వే స్కోరు 125 పరుగులే. ఆ జట్టు ఆఖరి నాలుగు ఓవర్లలో రెండు వికెట్లు కోల్పోయి 29 పరుగులే చేయగలిగింది. మరుమానిని బౌల్డ్ చేయడం ద్వారా పేసర్ అశోక్ శర్మ కెరీర్‌లో తొలి అంతర్జాతీయ వికెట్‌ను దక్కించుకున్నాడు. జింబాబ్వేకు కళ్లెం వేసినప్పటికీ.. టీమ్‌ఇండియా ఫీల్డింగ్ పేలవం. భారత ఫీల్డర్లు అయిదు క్యాచ్‌లు వదిలేశారు.

**మయాంక్ 3/29**

**నిలిచాడు.. దంచాడు:** టీమ్‌ఇండియా అంతకుముందు విధ్వంసం సృష్టించకపోయినా.. మందకొడి పిచ్‌పై మంచి స్కోరు చేసిందనే చెప్పాలి. ఇన్నింగ్స్‌లో యువ వైభవ్ ఆటే హైలైట్. అయితే అతను ఎప్పటిలా విరుచుకుపడిపోలేదు. అవసరాలకు తగినట్లు తనను తాను మలుచుకోగలనని అతడు నిరూపించాడు. స్ట్రోక్‌ప్లేకు అంతగా అనుకూలంగా లేని పరిస్థితుల్లో వైభవ్.. సహనంతో బ్యాటింగ్ చేశాడు. భారత్ ఇన్నింగ్స్‌కు వెన్నెముకలా నిలిచాడు. మరో ఓపెనర్ అభిషేక్ (2) వరుసగా మూడో మ్యాచ్‌లో విఫలమైనా.. వైభవ్ మాత్రం చక్కని బ్యాటింగ్‌తో జట్టు గట్టి లక్ష్యాన్ని నిర్దేశించడంలో కీలక పాత్ర పోషించాడు. 15 ఏళ్ల వైభవ్ ఎదుర్కొన్న తొలి 9 బంతుల్లో 11 పరుగులు చేశాడంటేనే.. తన సహజ శైలికి భిన్నంగా ఎంత నెమ్మదిగా మొదలెట్టాడో అర్థం చేసుకోవచ్చు. ఓ దశలో 19 బంతుల్లో 31తో నిలిచాడు. చివరికి 31 బంతుల్లో అర్ధశతకం పూర్తి చేశాడు. పరిణతితో ఆడిన అతడు.. ఇషాన్ కిషన్ (29; 26 బంతుల్లో 4ఐ4)తో రెండో వికెట్‌కు 75, కెప్టెన్ శ్రేయస్ (27; 18 బంతుల్లో 2ఐ4) అయ్యర్‌తో మూడో వికెట్‌కు 50 పరుగులు జోడించాడు. సెంచరీ చేసేలా కనిపించిన వైభవ్.. లాంగాఫ్‌లో మద్వీర అందుకున్న కళ్లు చెదిరే క్యాచ్‌కు నిష్క్రమించాడు. అతను వీలైనప్పుడల్లా ఫోర్, సిక్స్ బాదేస్తూ ఇన్నింగ్స్ మంచి రన్‌రేట్‌తో సాగేలా చేశాడు.

# మణిపురి మాణిక్యాలు




## మీరాబాయికి హ్యాట్రిక్ పసిడి

## రిషికాంతకు రజతం

కామన్వెల్త్ క్రీడల్లో నాలుగో రోజు ఇద్దరు మణిపుర్ వెయిట్‌లిఫ్టర్లు అద్భుత ప్రదర్శన చేశారు. భారత అగ్రశ్రేణి వెయిట్‌లిఫ్టర్ మీరా బాయి చాను తనపై ఉన్న భారీ అంచనాలను నిలబెట్టుకుంటూ.. ఈ క్రీడల్లో వరుసగా మూడోసారి పసిడి నెగ్గింది. మణిపుర్‌కే చెందిన పురుష లిఫ్టర్ రిషికాంత సింగ్ అరంగేట్రంలోనే అదరగొట్టాడు. రజతం గెలిచాడు. మోకాలి ఇబ్బంది వల్ల అతను కాస్త తడబడ్డాడు గానీ లేదంటే స్వర్ణమే గెలిచేవాడే.

**స్టార్ వెయిట్‌లిఫ్టర్ మీరాబాయి..** ఈసారి కామన్వెల్త్ క్రీడల్లో భారత్ పసిడి నిరీక్షణకు తెరదించింది. ఆదివారం మహిళల 48 కేజీల వెయిట్‌లిఫ్టింగ్‌లో ఆమె ఉత్తమ ప్రదర్శనతో స్వర్ణం సాధించింది. స్నాచ్‌లో 85 కేజీలు ఎత్తిన మీరా.. క్లీన్ అండ్ జెర్క్ 105 కేజీలు మోసి, మొత్తంగా 190 కేజీలతో అగ్రస్థానం సాధించింది. తనకు, రజతం గెలిచిన అసుకో న్యాంగ్ (168, నైజీరియా)కు మధ్య వ్యత్యాసమే చెబుతోంది మీరా ఏ స్థాయిలో ఆధిపత్యం ప్రదర్శించిందో. మొదటి ప్రయత్నంలో (82 కేజీలు) విఫలమైన ఆమె.. పుంజుకుని విజేతగా నిలిచింది. జేన్ హెన్రీ (167, మలేసియా) కాంస్యం నెగ్గింది. కామన్వెల్త్ క్రీడల్లో మొత్తంగా మీరాకిది నాలుగో పతకం. 2014లో రజతం గెలిచిన మీరా బాయి.. తర్వాత వరుసగా మూడు క్రీడల్లోనూ పసిడి సాధించింది.

**రిషికాంత రజతం..:** మరోవైపు పురుషుల వెయిట్‌లిఫ్టింగ్‌లో రిషికాంతసింగ్ అదరగొట్టాడు. పురుషుల 60 కేజీల ఫైనల్లో రజతం అందుకున్నాడు. స్నాచ్‌లో రికార్డు స్కోరు (121 కేజీలు)తో అగ్రస్థానంలో నిలిచిన అతడు.. క్లీన్ అండ్ జెర్క్‌లో 143 కేజీలు ఎత్తి మొత్తంగా 264 కేజీలతో రెండో స్థానం దక్కించుకున్నాడు. మోకాలు ఇబ్బంది పెట్టడంతో అతను క్లీన్ అండ్ జెర్క్‌లో పూర్తి స్థాయి ప్రదర్శన చేయలేకపోయాడు. తొలి రెండు ప్రయత్నాల్లో విఫలమైన రిషికాంత.. ఆఖరి ప్రయత్నంలో సఫలమయ్యాడు. కామన్వెల్త్ క్రీడల స్నాచ్‌లో ఇప్పటిదాకా 120 కేజీలే ఉత్తమం. మహ్మద్ అనీక్ (273, మలేసియా) స్వర్ణం దక్కించుకోగా.. అముంగ ఎంబోయా (260, కెన్యా) కాంస్యం నెగ్గాడు.

**లాన్‌బౌల్స్‌లో తొలి ఓటమి..:** లాన్‌బౌల్స్‌లో భారత్‌కు తొలి పరాజయం. మహిళల పెయిర్స్ ఈవెంట్లో హ్యాట్రిక్ విజయాలతో దూసుకెళ్తున్న రూపరాణి టిర్కీ, పింకి సింగ్ జోడీకి నాలుగో మ్యాచ్‌లో నమీబియాతో ఓటమి తప్పలేదు. చెరో సెట్ గెలవడంతో టైబ్రేక్ నిర్వహించగా.. అక్కడ భారత అమ్మాయిలు 0-3తో ఓడిపోయారు. అయితే ఇప్పటికే 3 విజయాలతో మంచి స్థితిలో ఉన్న భారత్ ఆఖరి మ్యాచ్ (ఇంగ్లాండ్‌పై)లో గెలిస్తే సెమీస్ బెర్తు ఖాయం చేసుకుంటుంది.

# అఖిల్ నెక్స్ట్.. లెనిన్ జోష్ కంటిన్యూ అవ్వాలంటే..

ఆషికా రంగనాథ్‌తో సింప్లిసిటీ దాని బెస్ట్





ఒక విజయం ఇచ్చే జోష్ అంతా ఇంతా కాదు. ముఖ్యంగా చాలా కాలంగా ఎదురుచూసిన సక్సెస్ వచ్చినప్పుడు సెల్ఫ్ కాన్ఫిడెన్స్ మరింత పెరుగుతుంది. ఇప్పుడు అక్కినేని యంగ్ హీరో అఖిల్ పరిస్థితి కూడా అలాగే ఉంది. లెనిన్ సినిమాతో మంచి విజయాన్ని అందుకున్న అఖిల్.. అదే జోష్‌ను తన తదుపరి సినిమాలతో కూడా కొనసాగించాలని చూస్తున్నారు. అయితే ఆ జర్నీలో అఖిల్ తీసుకునే నిర్ణయాలే చాలా కీలకంగా మారనున్నాయి.

అఖిల్ కెరీర్ మొదటి నుంచి అంచనాలతోనే సాగింది. అక్కినేని కుటుంబం నుంచి వచ్చిన హీరో కావడంతో ఆయనపై మొదటి సినిమా నుంచే ప్రత్యేకమైన ఆసక్తి ఏర్పడింది. అయితే తొలి ప్రయత్నాల తర్వాత ప్రేక్షకుల అంచనాలకు తగ్గ విజయాన్ని అందుకోవడానికి కొంత సమయం పట్టింది. ఈ క్రమంలో విభిన్నమైన కథలను ప్రయత్నిస్తూ తనను తాను ప్రూవ్ చేసుకునే ప్రయత్నం చేశారు.ఇప్పుడు లెనిన్ విజయంతో అఖిల్ కు కొత్త ఉత్సాహం వచ్చింది. ఆ సినిమా ఇచ్చిన నమ్మకంతో తదుపరి సినిమాల విషయంలో మరింత జాగ్రత్తగా అడుగులు వేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఎందుకంటే ఒక సినిమా విజయాన్ని కొనసాగించడం అనేది హీరో కెరీర్ లో అత్యంత ముఖ్యమైన దశగా ఉంటుంది. లెనిన్ తర్వాత అఖిల్ ముందున్న ప్రధాన సవాల్.. మరో మంచి కథను ఎంచుకోవడమేనని చెప్పాలి.ఒక సినిమా విజయాన్ని దృష్టిలో పెట్టుకుని.. ప్రేక్షకులకు కొత్త అనుభూతిని ఇచ్చే కథలను ఎంచుకోవడం అవసరం. ఒక హీరోకు సరైన సమయంలో సరైన కథ దొరికితే కెరీర్ లో పెద్ద చేంజ్ తీసుకురాగలదు. ప్రస్తుతం ప్రేక్షకుల టేస్ట్ లు కూడా మారుతున్నాయి. కేవలం హీరో ఇమేజ్ ను నమ్ముకుని సినిమాలు చూసే పరిస్థితి తగ్గింది. కథ, స్క్రీన్ ప్లే, పాత్రలో కొత్తదనం ఉంటేనే ప్రేక్షకులు సినిమాను ఆదరిస్తున్నారు. అందుకే అఖిల్ కూడా తన తదుపరి ప్రాజెక్టుల విషయంలో కథకే ఎక్కువ ఇంపార్టెన్స్ ఇవ్వాల్సిన అవసరం ఉంది.ఇప్పటివరకు అఖిల్ చేసిన సినిమాలు ఆయనకు ఎన్నో ఎక్స్పీరియన్స్ లు ఇచ్చాయి. ఏ తరహా పాత్రలు తనకు సరిపోతాయి? ప్రేక్షకులు తన నుంచి ఏమి ఆశిస్తున్నారు? అనే విషయాలపై ఆయనకు క్లారిటీ వచ్చి ఉంటుంది. లెనిన్ విజయం తర్వాత ఆ అనుభవంతోనే తదుపరి స్టెప్స్ వేయనున్నారని తెలుస్తోంది. హిట్ వచ్చిన తర్వాత వచ్చే అంచనాలు కూడా పెరుగుతాయి. అభిమానులు మాత్రమే కాదు.. సాధారణ ప్రేక్షకులు కూడా తర్వాతి సినిమా ఎలా ఉండబోతుందో ఆసక్తిగా ఎదురుచూస్తారు.అందుకే అఖిల్ పై ఇప్పుడు బాధ్యత మరింత పెరిగింది. ఏదేమైనా.. లెనిన్ అఖిల్ కు ఒక మంచి ఆరంభాన్ని ఇచ్చింది. ఇప్పుడు ఆ సక్సెస్ ను ముందుకు తీసుకెళ్లాలంటే కథల ఎంపికలో జాగ్రత్త, పాత్రల్లో వైవిధ్యం, ప్రేక్షకులకు కొత్త అనుభూతిని అందించే ప్రయత్నం అవసరం. అఖిల్ తర్వాతి సినిమా ఎలా ఉండబోతుంది? లెనిన్ ఇచ్చిన జోష్ ను ఆయన ఎలా కొనసాగిస్తారు? అన్నది ఇప్పుడు ఆసక్తిగా మారింది.

తాజా పసుపు నేపథ్య స్నాప్‌లలో ప్రగ్యా నయన్ అబ్బురపరుస్తుంది



PENSATTA TELUGU DAILY Printed, Published, Owned by CHITAMANENI ANIL KUMAR, D.NO 1-1, RAJULA ILLA PAKKANA, VENKATAPURAM, THANAM POST, MUNGAPAKA MANDAL, ANAKAPALLI VISHAKAPATNAM, ANDHRA PRADESH 531021 ,Publishe at D.NO 1-1, RAJULA ILLA PAKKANA, VENKATAPURAM, THANAM POST, MUNGAPAKA MANDAL, ANAKAPALLI VISHAKAPATNAM, ANDHRA PRADESH 531021 . And Printed at Chaitanya Vaaradhi printers, Do.No 2-99 Bharanikam, Paravada Anakapalli, Visakhapatnam- 531 021. Editor: CHITAMANENI ANIL KUMAR, D.NO 1-1, RAJULA ILLA PAKKANA, VENKATAPURAM, THANAM POST, MUNGAPAKA MANDAL, ANAKAPALLI VISHAKAPATNAM, ANDHRA PRADESH 531021 , Cell: 99853 15759, RNI. No APTEL/2023/87729, E-mail:anilchinthamneni@gmail.com